SRIVEDHA WEB SOLUTIONS
Empowering Business Digitally!
Our Services
✓ Website Design & Development
✓ Digital Marketing (SEO/SEM,SMM, Google Ads)
✓ Branding Graphic Design
✓ CGI Ads | Meta Ads | AI Videos
Want to take your business online?
Now it's simple! At SRIVEDHA WEB SOLUTIONS, we build businesses a strong online presence through smart website design, powerful digital and brand identity. We deliver quality, and results – everything a brand needs to grow digitally.
Office Address: VSS Nandeep Apartment, Call: 95731 23699 Email: srivedhawebsolutions@gmail.com www.srivedhawebsolutions.com

సమాజ హితం - మా అభిమతం
www.arunaprabha.com
# అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
RNI NO. TEL TEL/2023/89778

unitedtradinglogistics@gmail.com
+91 7995813899
+91 9059862988
UNITED LOGISTICS
AIR CARGO SERVICES | SHIPMENT SERVICES
20",40" CONTAINER SERVICES | FLATRACK CONTAINER SERVICES
Near ORR Exit No.11, Opp. TARA Convention Hall, Pedda Amberpet, Hyderabad, Telangana.

రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 217 పేజీలు : 12, వెల రూ. 5/- మంగళవారం, సెప్టెంబరు 29, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# సైమన్ గో బ్యాక్ తరహాలో
# దేశమంతా 'సర్ గో బ్యాక్' ఉద్యమం



**ఓటు హక్కును తొలగించే కుట్రలను ప్రజలు సహించరు**

**దేశవ్యాప్తంగా 20 కోట్ల ఓట్ల తొలగింపే లక్ష్యమని ఆరోపణ**

**డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం**

**మైనార్టీల హక్కులను అణచివేస్తే విప్లవాలు తప్పవు**

**తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు**

**ఢిల్లీ సదస్సులో ఎన్నికల సంఘంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు**

ఢిల్లీ, సెప్టెంబర్ 29: దేశంలో ఓటు హక్కు పరిరక్షణ, నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ వంటి అంశాలపై రాజకీయ చర్చ మళ్లీ వేడెక్కింది. బ్రిటిష్ పాలనలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉద్యమం సాగిన తరహాలోనే, ప్రస్తుతం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రజలు ఏకమయ్యే పరిస్థితి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించబోరని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల ఓట్లను తొలగించాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ పరిణామాలపై ప్రతిపక్షాలన్నీ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అస్సాంకు చెందిన 'ప్రతిదిన్' పత్రిక సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో 'ఇండియాస్ నెక్ట్స్ చాప్టర్' అంశంపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు. దేశ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఎన్నికల సంఘం పనితీరు, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, కేంద్ర ప్రభుత్వ విధానాలు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటు హక్కు విషయంలో ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని

(మిగతా 2వ పేజీలో)



# దేవుళ్లను కూడా విభజిస్తారా?
## రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్

**రాముడు, శివుడి మధ్య రేవంత్ రెడ్డి రాజకీయ చిచ్చు పెడుతున్నారన్న బండి సంజయ్**

**కులం, ప్రాంతం తర్వాత దేవుళ్లను కూడా విభజిస్తున్న కాంగ్రెస్ అని విమర్శ**

**దక్షిణ కాశీ, దక్షిణ అయోధ్య ఉన్న రాష్ట్రంలో ఇలాంటి రాజకీయాలు సరికాదంటూ హితవు**

**ప్రధాని మోదీ కాశీ విశ్వనాథుని భక్తుడని, వేములవాడకు వచ్చారని గుర్తుచేశారు**

**ఓట్ల కోసం దేవుళ్లను వాడుకుని, ఇప్పుడు విభజిస్తున్నారని తీవ్ర ఆరోపణ**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేవుళ్లను కూడా విభజించే

(మిగతా 2వ పేజీలో)



# కాంగ్రెస్, భాజపాలపై యువతలో తీవ్ర అసంతృప్తి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాసదే విజయమని కేటీఆర్ ధీమా

ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగుల్లో రేవంత్ సర్కారుపై వ్యతిరేకత

కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై నిరసన

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలూ కైవసం చేసుకుంటాం

ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలి

ఎన్నికల సన్నాహక సమావేశంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 29: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని భాజపా పాలనపై యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలు రెండు ప్రభుత్వాల విధానాలపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

(మిగతా 2వ పేజీలో)



# రాష్ట్రం దాటితే.. స్థానికతకు దూరం!

**నాలుగేళ్ల నిరంతర విద్య తప్పనిసరి**

**రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే అర్హత నిర్ధారణ**

**తెలంగాణ జీవోను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**ఏపీలో ఇంటర్ చదివిన విద్యార్థికి నిరాశ**

**స్థానికత నిబంధనలను సవాల్ చేస్తూ పిటిషన్.. కొట్టివేత**

# హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం.. వీడియో వైరల్

**హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం**

**అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు**

**కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు**

**సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు**





# సుప్రీంకోర్టుకు తెలంగాణ హైకోర్టు సీజే

**జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సహా ముగ్గురి పేర్లు సిఫార్సు**

**గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ పదోన్నతి**

**తెలంగాణ హైకోర్టుకు తిరిగి జస్టిస్ టి.వినోద్‌కుమార్**

**నియామకాలపై కొలీజియం కీలక నిర్ణయం**

# ఓట్ల చోరీపై కాంగ్రెస్ సమరభేరి

**రాహుల్ హెచ్చరికలు నిజమయ్యాయి భట్టి**

**సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**

**ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ఆగ్రహం**

**హైదరాబాద్‌లో ఇందిరా విగ్రహం నుంచి ఎన్నికల అధికారి కార్యాలయం వరకు ర్యాలీ**

**ఎన్నికల సంఘం పారదర్శకతపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని నేతల డిమాండ్**



హైదరాబాద్, సెప్టెంబర్ 28: ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. 'ఓట్ల చోరీ'పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గతంలో చేసిన హెచ్చరికలు ఇప్పుడు నిజమవుతున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో పౌరుల ఓట్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన

(మిగతా 2వ పేజీలో)



# ఏపీకి గుడ్ న్యూస్.. మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్ ప్రెస్ రైలు

**మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు కేంద్రం ఆమోదం**

**విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా కొనసాగనున్న సర్వీసు**

**వారానికి మూడు రోజులు రెండు దిశల్లోనూ రైలు రాకపోకలు**

**కోస్తా, , రాయలసీమ ప్రాంతాల మధ్య మెరుగైన అనుసంధానం**

**రాత్రిపూట మచిలీపట్నం నుంచి, పగటిపూట కర్నూలు నుంచి ప్రయాణం**

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
www.arunaprabha.com
మంగళవారం, సెప్టెంబరు 29, 2026

# సైమన్ గో బ్యాక్ తరహాలో దేశమంతా 'సర్ గో బ్యాక్' ఉద్యమం

పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనలో భారతీయులపై నిర్ణయాలు తీసుకునేందుకు 1928లో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ కమిషన్‌లో భారతీయులకు ప్రాతినిధ్యం లేకపోవడంతో దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారతీయుల భవిష్యత్తును నిర్ణయించే కమిషన్‌లో వారికే స్థానం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ లాలా లజపతిరాయ్ సహా పలువురు నాయకులు ఉద్యమించారని వివరించారు. 'సైమన్ గో బ్యాక్' నినాదం దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేసిందని, ఆ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమానికి మరింత ఊపునిచ్చిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఓటు హక్కుల విషయంలోనూ దేశ ప్రజలు అదే తరహాలో స్పందించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, పేదలు, బలహీన వర్గాలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు రాజ్యాంగం కల్పించిన ప్రధానమైన అవకాశం అదేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ హక్కును ఏ కారణంతోనైనా తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు, విధానాలపై ప్రజలకు స్పష్టత ఉండాలని, ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. దేశంలో ఓటర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఓట్ల తొలగింపుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని సీఎం అన్నారు. 2014లో దేశవ్యాప్తంగా సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019లో ఆ సంఖ్య 91 కోట్లకు, 2024లో 97 కోట్లకు చేరిందని వివరించారు. దేశ జనాభా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గణనీయంగా పెరిగిందని, ఓటు హక్కు వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించడం వల్ల యువ ఓటర్ల సంఖ్య కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగించడంపై సమగ్ర వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రేవంత్‌రెడ్డి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గతంలో ఓటర్ల జాబితాల్లో కొత్తగా పేర్లు చేర్చడం, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఉండేదని, ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియలో తొలగింపులకు ప్రాధాన్యం పెరిగిందని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నవారిని కృత్రిమ మేధ సాయంతో గుర్తించి, వారి ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన వివరణ రావాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల నిర్వహణకు సంబంధించిన అధికారాలు కేంద్రీకృతం కావడంపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో క్షేత్రస్థాయిలో అధికారులు నిర్వహించే ప్రక్రియలో ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం పాత్ర పెరిగిందని పేర్కొన్నారు. ఈసీఐ.నెట్ వెబ్‌సైట్ నిర్వహణతోపాటు ఓటర్ల వివరాలకు సంబంధించిన వ్యవస్థలు దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల క్షేత్రస్థాయి అధికారులకు కూడా ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులపై పూర్తి సమాచారం అందడం లేదని విమర్శించారు. ఎన్నికల సంఘంలోని సభ్యుల మధ్య కూడా నిర్ణయాల ప్రక్రియపై స్పష్టత ఉండాలని పేర్కొంటూ, ఉత్తరకొరియా ఎన్నికల విధానాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవస్థను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటు హక్కుల పరిరక్షణ విషయంలో దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పనిచేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ అంశం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే సంబంధించినది కాదని, దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుతో ముడిపడి ఉందని అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వంటి నాయకులంతా ఈ విషయంలో ఒకే అభిప్రాయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి అభిప్రాయాలను గౌరవించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం కావాలని అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు తొలగించబడినవారికి తమ అభ్యంతరాలు తెలియజేసేందుకు తగిన అవకాశం కల్పించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకుండా చూడటం ఎన్నికల వ్యవస్థ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# దేవుళ్లను కూడా విభజిస్తారా?



నీచమైన ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాముడు, శివుడి మధ్య రాజకీయ విభజన రేఖలు గీస్తూ, ఉత్తర, దక్షిణ భారత దేవుళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. "కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టిస్తూ కొత్త హాలాహలాన్ని తయారు చేస్తోంది" అని బండి సంజయ్ విమర్శించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఉన్న తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్‌లోనే హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ ఉంది. శివుడు, విష్ణువుల ఐక్యతకు ప్రతీక అయిన ఆ క్షేత్రం గురించి మీకు తెలియదా?" అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుడైన శివుడికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మొట్టమొదటి ప్రధాని కూడా ఆయనేనని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన మీరు, ఇప్పుడు అదే ప్రజలను విభజించడానికి దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు ఉంటారనేదే సనాతన ధర్మం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలను హిందువులు గమనించాలని, బీజేపీ నేతలు 'హర్ హర్ మహాదేవ్' అనరని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ప్రధాని మోదీ స్వయంగా ఆ నినాదం చేస్తారని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం.. వీడియో వైరల్

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## ఏపీకి గుడ్ న్యూస్.. మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మచిలీపట్నం, కర్నూలు సిటీ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించేందుకు ఆమోదం తెలిపింది. ఈ రైలు విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా ప్రయాణిస్తూ కీలక ప్రాంతాలను కలుపుతుంది. సుమారు 499 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ సర్వీసు, వారానికి మూడు రోజుల చొప్పున రెండు దిశల్లోనూ అందుబాటులో ఉండనుంది. ఈ రైలు మచిలీపట్నం నుంచి కర్నూలుకు సోమ, బుధ, శనివారాల్లో ఈ రైలు నడవనుంది. మచిలీపట్నంలో సాయంత్రం 4:55 గంటలకు బయలుదేరి, రాత్రంతా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, కర్నూలు సిటీ నుంచి మంగళ, గురు, ఆదివారాల్లో ఉదయం 9:30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9:35 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ సమయాలు రాత్రి ప్రయాణికులకు, అలాగే పగటిపూట ప్రయాణించాలనుకునే వారికి అనుకూలంగా ఉన్నాయి. ఈ రైలు సర్వీసుకు గుడివాడ, విజయవాడ, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపురం రోడ్, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల, బేతంచెర్ల, డోన్ స్టేషన్లలో వాణిజ్యపరమైన హాల్టులను కేటాయించారు. ఈ కొత్త రైలుతో కోస్తా జిల్లాల నుంచి పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ప్రత్యక్ష రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వైద్య అవసరాల కోసం ఈ ప్రాంతాల మధ్య తరచూ ప్రయాణించే వేలాది మందికి ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రైలు నంబర్, ఛార్జీల వివరాలను రైల్వే శాఖ త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.

# సుప్రీంకోర్టుకు తెలంగాణ హైకోర్టు సీజే

**జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సహా ముగ్గురి పేర్లు సిఫార్సు**

**గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ పదోన్నతి**

**తెలంగాణ హైకోర్టుకు తిరిగి జస్టిస్ టి.వినోద్‌కుమార్**

**నియామకాలపై కొలీజియం కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందనున్నారు. ఆయనతోపాటు గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని అత్యున్నత న్యాయస్థానం కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం సోమవారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం రాష్ట్రపతి అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేయనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని కొలీజియం సిఫార్సు చేసిన వారిలో తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తోపాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఉన్నారు. ఈ ముగ్గురి నియామకాలు పూర్తయితే సుప్రీంకోర్టులో వారి సేవలు అందుబాటులోకి రానున్నాయి. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ న్యాయరంగంలో విశేష అనుభవం కలిగిన కుటుంబం నుంచి వచ్చారు. 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధాసింగ్ దంపతులకు జన్మించారు. ఆయన కుటుంబంలో పలువురు ప్రముఖులు ఉన్నత న్యాయస్థానాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తల్లివైపు తాత జస్టిస్ బి.పి.సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. మరో తాత జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. ఆయన సమీప బంధువులైన జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేశారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకుని అదే ఏడాది నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. అనంతరం 2001 నుంచి జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. న్యాయవాదిగా అనుభవం సంపాదించిన ఆయన 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014 జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ కార్యనిర్వాహక చైర్మన్‌గా కూడా ఆయన సేవలందించారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. అనంతరం 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందేందుకు కొలీజియం సిఫార్సు చేయడంతో న్యాయవర్గాల్లో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కాంగ్రెస్, భాజపాలపై యువతలో తీవ్ర అసంతృప్తి

ఎన్నికల్లో భారాసకు అనుకూలంగా మారతాయని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రా డ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంతో పాటు మరో గ్రాడ్యుయేట్ స్థానంలోనూ పార్టీ విజయం సాధించే అవకాశాలు న్నాయని తెలిపారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమష్టిగా పనిచేయాలని సూచిం చారు. తెలంగాణ భవన్‌లో సోమవారం హైదరాబాద్, రంగా రెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భారాస ముఖ్య నాయకులు, ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులతో కేటీఆర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎన్నికల కార్యాచరణ, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల బాధ్యతలు, ప్రచార వ్యూహాలపై చర్చించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు అత్యంత ప్రాధాన్యం ఉందని, అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా భాజపా ప్రజాదరణ తగ్గుతోందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో పాలకుల తీరుపై నిరసన వ్యక్తమవుతోందని తెలిపారు. కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని భారాసకు అనుకూలంగా మలచుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.

## ఓట్ల చోరీపై కాంగ్రెస్ సమరభేరి

చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని నిరసనలో పాల్గొన్నారు. అనంతరం భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ తదితరులు ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ప్రాణవాయువులాంటిదని భట్టి విక్రమార్క అన్నారు. పౌరుల ఓటు హక్కుకే భంగం కలిగితే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లే అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. భారత ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగం కల్పించిన హక్కులపై కాంగ్రెస్‌కు సంపూర్ణ విశ్వాసం ఉందని భట్టి తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థపై నమ్మకం ఉన్న రాజకీయ పార్టీలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఎన్నికల పారదర్శకత కోసం కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా నిర్వహణ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ప్రతి దశలోనూ ప్రజల విశ్వాసం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎన్నికలు నిర్వహించడమే కాకుండా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమగ్రంగా సాగుతున్నదనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడం కూడా సంఘం బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం తగ్గే పరిస్థితులు ఏర్పడకుండా చూడాలని సూచించారు.




# రాష్ట్రం దాటితే.. స్థానికతకు దూరం!

**నాలుగేళ్ల నిరంతర విద్య తప్పనిసరి**

**రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే అర్హత నిర్ధారణ**

**తెలంగాణ జీవోను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**ఏపీలో ఇంటర్ చదివిన విద్యార్థినికి నిరాశ**

**స్థానికత నిబంధనలను సవాల్ చేస్తూ పిటిషన్.. కొట్టివేత**



న్యూఢిల్లీ: ఉన్నత విద్య కోసం రాష్ట్రం దాటి వెళ్లిన తెలంగాణ విద్యార్థులకు స్థానికత విషయంలో నిబంధనలే ప్రామాణికమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలంటే అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలోనే చదివి ఉండాలన్న నిబంధనను తప్పనిసరిగా పాటించాలని తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో, రాష్ట్రపతి ఉత్తర్వులను కాదని ప్రత్యేక మినహాయింపులు కల్పించలేమని స్పష్టం చేసింది. తెలంగాణలో పాఠశాల విద్యను అభ్యసించి, ఇంటర్మీడియట్ కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో స్థానికత నిర్ధారణకు సంబంధించి అమల్లో ఉన్న నాలుగేళ్ల విద్యాభ్యాస నిబంధన మరోసారి చర్చనీయాంశంగా మారింది.

జెల్లా అంకిత ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు 12 ఏళ్లపాటు తెలంగాణలోనే విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ చదివేందుకు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి రెండేళ్లు అక్కడే చదివారు. ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో స్థానికత సమస్య ఎదురైంది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు ఎక్కడ చదివారన్న నిబంధన ప్రకారం ఆమెకు తెలంగాణ స్థానిక కోటా వర్తించలేదు. దీంతో తనకు స్థానిక హోదా కల్పించాలని కోరుతూ తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, స్థానికతకు సంబంధించిన ప్రభుత్వ జీవోను హైకోర్టు సమర్థించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ.. అంకిత పాఠశాల విద్య మొత్తం తెలంగాణలోనే పూర్తిచేశారని, కేవలం ఉన్నత విద్య కోసం మాత్రమే రెండేళ్లు ఏపీకి వెళ్లారని వివరించారు. ఆమె తండ్రి, తాత కూడా తెలంగాణలోనే నివసిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో స్థానికతను నిరాకరిస్తే రెండు రాష్ట్రాల్లోనూ స్థానిక కోటా ప్రయోజనం పొందలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కుటుంబ నేపథ్యం, తెలంగాణలో సుదీర్ఘకాలం విద్యాభ్యాసం చేసిన అంశాలను పరిగణనలోకి తీసుకొని మినహాయింపు ఇవ్వాలని కోరారు. వాదనలు పరిశీలించిన జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం.. స్థానికత నిర్ధారణకు సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు సమర్థించిన నేపథ్యంలో, దాని ప్రకారమే అర్హతను నిర్ణయించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తండ్రి ఎక్కడ నివసిస్తున్నారన్న అంశంతో సంబంధం లేకుండా, స్థానికతకు వర్తించే విద్యాభ్యాస నిబంధనలను పాటించాల్సిందేనని పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పుడు వాటిని పక్కనపెట్టి ప్రత్యేక ప్రయోజనం కల్పించడం సాధ్యం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లపాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను వ్యక్తిగత పరిస్థితుల ఆధారంగా సడలించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొంటూ అంకిత పిటిషన్‌ను కొట్టివేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును కూడా ప్రస్తావిస్తూ, స్థానికతకు సంబంధించిన నిబంధనలను మరోసారి పునరుద్ఘాటించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో తెలంగాణలో స్థానిక కోటా కింద ఉన్నత విద్యా ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు వర్తించే నిబంధనలపై స్పష్టత వచ్చినట్లయింది. ముఖ్యంగా పాఠశాల విద్యను తెలంగాణలో పూర్తి చేసి, ఇంటర్మీడియట్ లేదా ఇతర కోర్సుల కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులు స్థానికత అర్హతను ముందుగానే పరిశీలించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వైద్య విద్యతో పాటు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిని తెలుసుకోవడం కీలకంగా మారింది.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ ఏకపక్ష విధానాలపై కందుకూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ సర్కిల్ (అరుణ ప్రభ న్యూస్ 28) ఏఐసీసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో ఓటర్ల జాబితా సవరణ పేరిట కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓట్లను తొలగిస్తున్న కేంద్ర ఏకపక్ష విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింతపారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సామ నర్సింహారెడ్డి గార్డెన్స్ నుండి అంబేడ్కర్ విగ్రహం వరకు సాగిన ఈ నిరసన ర్యాలీకి ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కోఆర్డినేటర్ సచిన్ సావంత్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల జాబితానుసవరించాల్సిందిపోయి అధికార పార్టీకి అనుకూలంగా ఈసీ ఏకపక్షంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఈ సందర్భంగా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జీ కిచెన్నగారి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ భీమ్ భరత్, కాంగ్రెస్ మీడియా కమిటీ మాజీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణ రెడ్డి, ఎల్బీ నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రాంమోహన్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, నాయకులు రాచమల్ల సిద్దేశ్వర్, తీగల అనిత హరినాథ్ రెడ్డి, శేఖర్ గౌడ్, ఏనుగు జంగా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు రాణప్రతాప్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సరికొండ పాండు, అలాగే పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు మరియు యూత్ కాంగ్రెస్, NSUI, మహిళా కాంగ్రెస్ కమిటి సభ్యులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలి

**కలెక్టర్‌కు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ వినతి..**

**సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎస్. ఆంజనేయులు**



గజ్వేల్ అరుణ ప్రభ : జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎస్. ఆంజనేయులు కోరారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను టీజేఏ ప్రతినిధులు కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి గత ప్రభుత్వాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా తగిన స్థాయిలో చొరవ చూపలేదనే భావన జర్నలిస్టుల్లో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని టీజేఏ తరఫున విజ్ఞప్తి చేశారు. యూనియన్ వ్యవస్థాపకులు ఉప్పల లక్ష్మణ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల కోసం, వారి ఇళ్ల స్థలాలు, ఇళ్ల సాధన కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ స్పందిస్తూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. సత్యనారాయణ, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు వంగ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. లింగమూర్తి, కోశాధికారి ,సిహెచ్. మహేందర్, ఈసీ సభ్యులు లింగాల బాబు, యూనియన్ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ప్రత్యేక కమిటీ సమావేశం

సికింద్రాబాద్, సెప్టెంబరు 28: సికింద్రాబాద్ కోనేరు వీధిలోని శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం లో శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ప్రత్యేక పునర్నిర్మాణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. దేవస్థాన ఛైర్మన్ శ్రీ పి. వెంకట్రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. అక్టోబరు 11, 2026 నుంచి నవంబరు 23, 2026 వరకు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను భక్తుల విశేష భాగస్వామ్యంతో అత్యంత వైభవంగా, శోభాయమానంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అలాగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కంటోన్మెంట్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీగణేష్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని కమిటీ తీర్మానించింది. సమావేశంలో కమిటీ సభ్యులు నీలం ప్రకాష్, దర్గా రవి కుమార్, పంపాల నరసింహ, మైసాని శేఖర్, దుడుక్ల ఎల్లం రావు, గారిపల్లి నీలిమ, కొప్పురవూరి సుధాకర్, గాంధీ మాధవి, ఇనుగంటి కిరణ్, అప్పల నాగేష్ యాదవ్, కురాకుల రాజు పాల్గొన్నారు. దేవస్థాన ఈఓ కె.పి. సత్యమూర్తి, అర్చకులు సారథి పంతులు, మణి పంతులు, గౌతమ్ పంతులు, బాలాజీ పంతులతో పాటు దేవస్థాన సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.



# ఏఐ దూకుడుకు కళ్లెం.. ఎన్విడియా కొత్త టూల్ ఆవిష్కరణ

**ఏఐ ఏజెంట్లు అదుపు తప్పకుండా చూసేందుకు ఎన్విడియా కొత్త టూల్**

**'ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ప్లాట్‌ఫామ్'ను ఆవిష్కరించిన చిప్ మేకర్**

**ఏఐ భద్రతపై ఇతర సీఈఓలతో విభేదించిన జెన్సన్ హువాంగ్**

**రికార్డు స్థాయిలో 150 బిలియన్ డాలర్ల షేర్ బైబ్యాక్ ప్రకటించిన ఎన్విడియా**

**కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద షేర్ బైబ్యాక్‌గా నమోదు**



టెక్నాలజీ దిగ్గజం, చిప్‌మేకర్ ఎన్విడియా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భద్రత విషయంలో కీలక ముందడుగు వేసింది. ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించకుండా నిరోధించేందుకు ఒక కొత్త సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌ను ఆవిష్కరించింది. 'ఎన్విడియా ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ప్లాట్‌ఫామ్' పేరుతో తీసుకొచ్చిన ఈ టూల్‌ను 100కు పైగా పరిశ్రమ భాగస్వాములతో కలిసి అభివృద్ధి చేసినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్లాట్‌ఫామ్ ఏఐ ఏజెంట్లు చేసే ప్రతి పనిని పర్యవేక్షిస్తుంది. కంపెనీ నిబంధనలను అతిక్రమించకుండా చూస్తుంది. ఈ సందర్భంగా ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ మాట్లాడుతూ, "ఏఐ భద్రత సమస్యను పరిష్కరించినప్పుడే సమాజానికి దాని అసాధారణ సామర్థ్యం పూర్తిగా అందుబాటులోకి వస్తుంది. ఏఐ సామర్థ్యాల సరిహద్దులను మనం కనుగొంటున్న కొద్దీ, ఏఐ భద్రత విషయంలోనూ ఆవిష్కరణలను వేగవంతం చేయాలి" అని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ఏఐ వ్యవస్థలు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు లేకుండానే కార్పొరేట్, ప్రభుత్వ వ్యవస్థల్లోకి చొరబడినట్లు వార్తలు వచ్చాయి. ఓపెన్‌ఏఐ ఏజెంట్లు అమెరికా ప్రభుత్వ సైట్లను లక్ష్యంగా చేసుకున్నాయనే నివేదికలు ఆందోళన రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ వంటి వారు ఏఐపై కఠినమైన నియంత్రణలు ఉండాలని పిలుపునిచ్చారు. అయితే, జెన్సన్ హువాంగ్ మాత్రం ఈ వాదనతో విభేదిస్తున్నారు. ఏఐ వల్ల మానవాళికి పెను ముప్పు ఉందన్న వాదనలను ఆయన కొట్టిపారేశారు. నిబంధనలు పరిశ్రమ వృద్ధికి ఆటంకం కలిగించకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. "తమ కంపెనీ అదుపు తప్పుతోందని వారు భావిస్తే, ముందు ఆ కంపెనీని అదుపులోకి తెచ్చుకోవాలి" అంటూ సీఎన్‌ఎన్‌తో మాట్లాడుతూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో, ఎన్విడియా మరో సంచలన ప్రకటన చేసింది. కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద షేర్ బైబ్యాక్‌కు తెరలేపింది. ఏకంగా 150 బిలియన్ల డాలర్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఉన్న 85 బిలియన్ డాలర్ల ప్రోగ్రామ్‌కు ఇది అదనం. గతంలో ఆపిల్ ప్రకటించిన 110 బిలియన్ డాలర్ల బైబ్యాక్ రికార్డును ఎన్విడియా అధిగమించింది. కంపెనీ వద్ద భారీగా నగదు నిల్వలు ఉండటం, దీర్ఘకాలిక అవకాశాలపై ఉన్న బలమైన విశ్వాసానికి ఇది నిదర్శనమని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఎన్విడియా మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 5.4 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అయితే, ఈ భారీ ప్రకటనల తర్వాత కూడా ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు స్వల్పంగానే పెరిగాయి.

## సంపాదకీయం

# నేపాల్‌లో జలవిలయం.. ప్రకృతి ప్రకోపానికి హెచ్చరిక

నేపాల్‌లో భారీ కొండ కేవలం ఆరు సెకన్ల వ్యవధిలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిందన్న వార్త ప్రకృతి శక్తి ఎంత భయానకంగా ఉంటుందో మరోసారి గుర్తుచేస్తోంది. పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదలు సంభవించడం కొత్త విషయమేమీ కాదు. అయితే వాతావరణ మార్పులు, అస్థిరమైన పర్వత భౌగోళిక పరిస్థితులు, అస్తవ్యస్తమైన నిర్మాణాలు, అడవుల నరికివేత వంటి మానవ చర్యలు ఈ విపత్తుల తీవ్రతను పెంచుతున్నాయన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు దానిని పూర్తిగా ఆపడం సాధ్యం కాకపోవచ్చు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించడం, ప్రాణనష్టాన్ని నివారించడం, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. నేపాల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనను కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన ప్రకృతి విలయంగా చూడకుండా, పర్వత ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణపై సమాజం పునరాలోచించాల్సిన హెచ్చరికగా భావించాలి.

నేపాల్ భౌగోళికంగా అత్యంత ప్రత్యేకమైన దేశం. ప్రపంచంలోని ఎత్తైన పర్వత శ్రేణుల్లో ఒకటైన హిమాలయాలు ఈ దేశంలో విస్తరించి ఉన్నాయి. మంచుతో కప్పబడిన శిఖరాలు, లోతైన లోయలు, వేగంగా ప్రవహించే నదులు, కొండల మధ్య విస్తరించిన గ్రామాలు నేపాల్ సహజ స్వరూపానికి ప్రతీకలు. అదే సమయంలో ఈ భౌగోళిక పరిస్థితులే ఆ దేశాన్ని భూకంపాలు, కొండచరియల విరుగుడు, ఆకస్మిక వరదలు, హిమపాతాలు వంటి ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో భూమి పొరలు నిరంతరం మార్పులకు లోనవుతుంటాయి. వర్షాలు, మంచు కరగడం, భూకంపాలు, నదుల కోత వంటి ప్రక్రియలు కొండల స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్నిసార్లు చిన్న పగుళ్లతో ప్రారంభమైన మార్పులు ఒక్కసారిగా భారీ కొండచరియల విరుగుడుకు దారితీస్తాయి. బయటకు దృఢంగా కనిపించే పర్వతం లోపల ఎంతగా బలహీనపడిందో ముందుగానే గుర్తించడం సులభం కాదు. అందుకే పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రకృతి సంకేతాలపై అవగాహన, శాస్త్రీయ పర్యవేక్షణ, సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థలు అత్యంత అవసరం.

కొండ కూలిపోవడం అనేది కేవలం రాళ్లు, మట్టి కిందికి జారిపడే భౌతిక ప్రక్రియ మాత్రమే కాదు. అది పర్వత ప్రాంతాల జీవన విధానాన్ని, నదుల ప్రవాహాన్ని, స్థానిక ఆర్థిక వ్యవస్థను, ప్రజల భద్రతను ప్రభావితం చేసే పరిణామం. భారీ కొండచరియలు నదిలో పడినప్పుడు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట ఏర్పడవచ్చు. కొన్నిసార్లు నది తాత్కాలికంగా నిలిచిపోయి వెనుకవైపు నీరు పేరుకుపోతుంది. ఆ అడ్డంకి ఒక్కసారిగా తెగిపోతే దిగువ ప్రాంతాలకు భారీ వరద ముప్పు ఏర్పడుతుంది. మరోవైపు కొండచరియలతో నదిలో మట్టి, రాళ్లు, చెట్లు చేరడం వల్ల నది అడుగు భాగం మారిపోవచ్చు. నీటి ప్రవాహం కొత్త దారులు వెతుక్కోవచ్చు. నదీ తీరాల్లోని గ్రామాలు, రహదారులు, వంతెనలు, సాగుభూములు ప్రమాదంలో పడవచ్చు. అందువల్ల ఇలాంటి ఘటన జరిగిన వెంటనే కొండ కూలిన ప్రాంతానికే కాకుండా, నది దిగువన ఉన్న ప్రాంతాలకూ ప్రమాద అంచనాలు రూపొందించడం అవసరం.

ప్రకృతి వైపరీత్యాలు ఒక్కసారిగా సంభవించినట్లు కనిపించినా, వాటి వెనుక అనేక ప్రక్రియలు దీర్ఘకాలంగా కొనసాగుతుంటాయి. పర్వతాల్లో రాళ్ల మధ్య పగుళ్లు ఏర్పడటం, వర్షపు నీరు భూమిలోకి ఇంకి నేల పొరలను బలహీనపరచడం, నదులు కొండల అడుగు భాగాన్ని కోయడం, ఉష్ణోగ్రతల మార్పులతో మంచు కరగడం వంటి పరిణామాలు కొండల స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. భూకంపాలు ఈ పరిస్థితులను మరింత సంక్లిష్టం చేస్తాయి. కొండపై ఉన్న మట్టి, రాళ్ల బరువు, వాలుదనం, నేలలోని తేమ, వృక్ష సంపద వంటి అంశాలన్నీ కొండచరియల విరుగుడుపై ప్రభావం చూపుతాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసిన కొద్ది గంటల్లోనే కొండచరియలు విరిగిపడుతుంటే, మరికొన్ని చోట్ల నెలలు లేదా సంవత్సరాలుగా కొనసాగుతున్న భౌగోళిక మార్పుల ఫలితంగా ప్రమాదం సంభవిస్తుంది. ఈ విభిన్న కారణాలను గుర్తించకుండా అన్ని కొండచరియల విరుగుళ్లనూ ఒకే కోణంలో చూడటం శాస్త్రీయ దృక్పథం కాదు.

వాతావరణ మార్పులు పర్వత ప్రాంతాలపై చూపుతున్న ప్రభావం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ మంచు కరగడం, హిమనీనదాల పరిమాణం తగ్గడం, వర్షపాత తీరులో మార్పులు చోటుచేసుకోవడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. హిమాలయ ప్రాంతాల్లో మంచు, హిమనీనదాలు, పర్వత సరస్సులు, నదులు పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఉష్ణోగ్రతల పెరుగుదలతో మంచు కరిగే వేగం మారడం, కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి సంభవించడం, మరికొన్ని చోట్ల దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడటం పర్వత పర్యావరణ వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అయితే ప్రతి కొండచరియల విరుగుడుకు వాతావరణ మార్పులే కారణమని చెప్పడం సరైనది కాదు. స్థానిక భౌగోళిక పరిస్థితులు, వర్షపాతం, భూకంపాలు, మానవ జోక్యం వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించినప్పుడే ఒక ఘటనకు కారణాలను నిర్ధారించగలం. శాస్త్రీయ ఆధారాలు లేకుండా కారణాలను నిర్ణయించడం కంటే, ప్రతి ఘటన నుంచి పాఠాలు నేర్చుకునే విధానాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యం.

పర్వత ప్రాంతాల్లో మానవ జోక్యం పెరుగుతున్న కొద్దీ ప్రకృతి సమతుల్యతపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. రహదారుల నిర్మాణం, సొరంగాల తవ్వకం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక కేంద్రాల విస్తరణ, నివాస నిర్మాణాలు అభివృద్ధికి అవసరమైనవే. కానీ వాటిని పర్యావరణ సామర్థ్యాన్ని అంచనా వేయకుండా చేపడితే ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. కొండల వాలులను కోసి రహదారులు వేయడం, సరైన నీటి పారుదల వ్యవస్థలు ఏర్పాటు చేయకపోవడం, నిర్మాణ వ్యర్థాలను లోయల్లో లేదా నదుల్లో పారవేయడం వల్ల నేల స్థిరత్వం దెబ్బతింటుంది. భారీ యంత్రాలతో కొండలను తవ్వడం, పేలుళ్ల ద్వారా రాళ్లను తొలగించడం వంటి చర్యలు కూడా కొన్ని ప్రాంతాల్లో భౌగోళిక మార్పులకు దోహదపడవచ్చు. అభివృద్ధి పనులు చేపట్టే ముందు భూగర్భ నిర్మాణం, వాలుదనం, వర్షపాతం, నదుల ప్రవాహం, భూకంప ముప్పు వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి. నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా పర్యవేక్షణ కొనసాగాలి. ప్రాజెక్టు అనుమతులు పొందడం ఒక్కటే భద్రతకు హామీ కాదు. క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది నిరంతరం పరిశీలించాలి.

నేపాల్ వంటి పర్వత దేశాలకు పర్యాటకం ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. ప్రకృతి అందాలను చూడటానికి, పర్వతారోహణ చేయడానికి, సాహస క్రీడల్లో పాల్గొనడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఈ పర్యాటక కార్యకలాపాలు స్థానిక ప్రజలకు ఉపాధి కల్పిస్తాయి. హోటళ్లు, రవాణా, మార్గదర్శక సేవలు, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. అయితే పర్యాటక రంగం విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వకపోతే సమస్యలు తలెత్తుతాయి. కొండ ప్రాంతాల్లో విచక్షణారహితంగా నిర్మాణాలు చేపట్టడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం, నీటి వనరులపై అధిక ఒత్తిడి, అడవుల విస్తీర్ణం తగ్గడం వంటి అంశాలు స్థానిక పర్యావరణంపై ప్రభావం చూపుతాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకుల భద్రత కూడా ప్రభుత్వాల బాధ్యత. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రయాణాలపై తగిన నియంత్రణలు విధించడం, వాతావరణ హెచ్చరికలు అందించడం, అత్యవసర పరిస్థితుల్లో తరలింపు మార్గాలను సిద్ధం చేయడం అవసరం.

ఈ ఘటన మరోసారి విపత్తుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తోంది. ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, భూమి కదలికలను గుర్తించే పరికరాలు, వర్షపాతం కొలిచే కేంద్రాలు, నదుల నీటిమట్టాన్ని పర్యవేక్షించే వ్యవస్థలు కొండచరియల ప్రమాదాన్ని అంచనా వేయడంలో సహాయపడతాయి. కొండలపై ఏర్పడే సూక్ష్మ కదలికలను గుర్తించే పరికరాలు ప్రమాద సూచనలను ముందుగానే అందించగలవు.



**-గుర్రం పాపిరెడ్డి**
**ఎడిటర్**

# సీసీ రోడ్డును ప్రారంభించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి సంగారెడ్డి డిసిసి అధ్యక్షులు

నారాయణఖేడ్ మండల పరిధిలోని జుజాల్‌పూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఈరోజు లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి సంగారెడ్డి డిసిసి అధ్యక్షులు గారులి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ వెలుగులు, తాగునీరు తదితర సౌకర్యాలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. జుజాల్‌పూర్ గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను కూడా దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్డు, హైమాక్స్ లైట్లు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మరియు ఇతర సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ రెడ్డి. ప్రజాప్రతినిధులు,అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పిప్రి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేసిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారులి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత మెరుగ్గా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో MGNREGS నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలను దశలవారీగా మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో నూతన బోరును ప్రారంభించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలిపటేల్ మారుతి, పలు గ్రామాల సర్పంచ్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జుక్కల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహారీ గోడను మరియు జుక్కల్ శివారులోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాల

# రహదారి కొరకు సిసి రోడ్డును ప్రారంభించిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారులి ప్రారంభించి, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేశారు. ముందుగా MGNREGS నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన జూకల్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రహదారి కోసం MGNREGS నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో అవసరమైన రహదారులు, పాఠశాలల మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు



కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, పండరెడ్డి నారాయణఖేడ్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రమేష్ చౌహన్, సర్దార్ నాయక్ సర్పంచ్, జుక్కల్ గ్రామ సర్పంచ్ లింగాపురం రజిత వినయ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాగవేణి చాగర్లమూడికి 'ఇండియన్ ఐకాన్' జాతీయ పురస్కారం

సారపాక: సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న తెలంగాణ సాహితి భద్రాచలం శాఖ, సారపాకకు చెందిన కవయిత్రి, రచయిత్రి నాగవేణి చాగర్లమూడి ప్రతిష్టాత్మకమైన లిలి'ఇండియన్ ఐకాన్ జాతీయ పురస్కారం'లిలికు ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, శ్రీ విరాట్ విశ్వకర్మ ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పురస్కారానికి ఆమెను ఎంపిక చేసినట్లు తెలిపారు. కవయిత్రిగా, రచయిత్రిగా సాహిత్య రంగంలో నాగవేణి చాగర్లమూడి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె అవార్డు ఎంపికకు సహకరించిన సంస్థల నిర్వాహకులు, సెలక్షన్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా సంస్థ తరఫున సాహిత్య సేవల్లో నిరంతరం ముందుంటూ, తనను ఈ పురస్కారానికి ఎంపిక చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన పోలోజు రాజ్‌కుమార్ కి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ శ్రీమతి వనపర్తి పద్మావతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళలు, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ సంస్థలను ముందుకు తీసుకెళ్తున్న నిర్వాహకుల సేవలను ఆమె అభినందించారు. సాహిత్యం, సంస్కృతిని పరిరక్షించడంతో పాటు కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని నాగవేణి చాగర్లమూడి



పేర్కొన్నారు.ఈ అవార్డు రావడానికి ప్రధాన కారణం అయినటువంటి సాహితీ మిత్రులు కవి, లాయర్ అయినటువంటి శశికాంత్ కి, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు,ఆయన పాటలతో సాహిత్యం పట్ల చిన్నప్పటి నుంచి ఎంతో ఆసక్తి పెంచిన శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి కి మన అందరికీ తండ్రి అయిన శ్రీ భద్రాచల శ్రీ రామచంద్రునికి అంకితం చేశారు .తనకు లభించిన ఈ అరుదైన పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

# గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

## ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం డాక్టర్

గజ్వేల్, అరుణ ప్రభ : గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి బి. కస్తూరిబాయికి రాయలసీమ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఆమె "రోల్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఎంఎస్ఎంఈ సెక్టార్: ఎ కేస్ స్టడీ ఆఫ్ సిద్ధిపేట డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ" అనే అంశంపై పరిశోధన చేశారు. దేశ అభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఉన్న ప్రోత్సాహకాలు, ఎదుర్కొంటున్న అవరోధాలు, ప్రభుత్వ పాత్ర తదితర అంశాలపై ఆమె అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం డాక్టర్ బి. కస్తూరిబాయిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్ కస్తూరిబాయి క్రమశిక్షణ కలిగిన అధ్యాపకురాలని, కళాశాల అభ్యున్నతితో పాటు విద్యార్థులకు మరింత మెరుగైన విజ్ఞానాన్ని అందించాలనే తపనతో పీహెచ్‌డీ సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల అధ్యాపకుల సమష్టి కృషితో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ కస్తూరిబాయి మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూనే వేల కిలోమీటర్లు



ప్రయాణించి పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో పరిశోధన పూర్తి చేసి కళాశాల అభివృద్ధిలో తాను కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని డాక్టర్ బి. కస్తూరిబాయికి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజల సమస్యలు పరిష్కరించాలి

## సబ్ కలెక్టర్ కి ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం

అరుణ ప్రభ:- భద్రాచలం సబ్ కలెక్టర్ కి ప్రజా సంక్షేమ సంఘం మహిళ కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందే దుర్గ ఆధ్వర్యంలో భద్రాచలం నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద ప్రజలకు ప్రభుత్వం ఇస్తానన్న సంక్షేమ పథకాలను నేరుగా అందించాలని, పేద ప్రజలకు స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్న ఇంకా పేదలు పేదలగానే ఉన్నారని, అర్హులైన మహిళలకు సొంతింటి కల నెరవేర్చేందుకు భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పెన్షన్ రాక ఉన్న పెన్షన్లు పోయి ఇబ్బంది పడుతున్న ఆసరా పెన్షన్ దారులకు పెన్షన్ వచ్చేలా చొరవ చూపాలని, భద్రాచలం నియోజకవర్గం లో అధ్వానంగా మారిన రోడ్లను బాగుపరిచి, ప్రమాదాల నుండి కాపాడాలని, ప్రభుత్వ హాస్పిటల్లో బీపీ, షుగర్, థైరాడ్, మరియు అత్యవసర మెడిసిన్స్ అన్ని అందుబాటులో ఉంచాలని, హాస్టల్లో, కాలేజీలలో విద్యార్థినిలకు శుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు పరితగతల విడుదల అయ్యేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ నాయకులు బర్ల భవాని, వెన్న రేవతి, పుట్ట మేరీ, దాసరి నాగమణి, వేణి, స్వర్ణ, సుజాత, సుత్తి ప్రమీల, సందా మేరీ, తదితరులు పాల్గొన్నారు

## పొదెం వీరయ్యపై అవాస్తవ ప్రచారం.. కాంగ్రెస్ ఖండన



అరుణ ప్రభ:-మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ( టి ఎస్ ఎఫ్ డి సి ) చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొదెం వీరయ్య బీఆర్ఎస్‌లో చేరనున్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రభ పత్రికలో, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి, గాంధీ కుటుంబ సిద్ధాంతాలకు పొదెం వీరయ్య నాలుగు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తున్నారని మహమ్మద్ ఖాన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ పార్టీని వీడకుండా కార్యకర్తలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆరుసార్లు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన వీరయ్య, ములుగు నుంచి రెండుసార్లు, భద్రాచలం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజలకు సేవలందించారని తెలిపారు. ప్రస్తుతం (టి ఎస్ ఎఫ్ డి సి) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక నిర్ధారణ లేకుండా రాజకీయ ఊహాగానాల ఆధారంగా వార్తలు ప్రచురించడం సరికాదని మహమ్మద్ ఖాన్ అన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీకి నమ్మకమైన నాయకుడిగా కొనసాగుతున్నారని స్పష్టం చేశారు.

## శంషాబాద్‌లో 19 ఏళ్ల యువతి మృతి.. కేసు నమోదు

### ప్రేమించిన యువకుడి మృతితో తీవ్ర మనస్తాపం చెందినట్లు పోలీసుల వెల్లడి



అరుణ ప్రభ - శంషాబాద్ జోన్ : జిహెచ్ఎంసి శంషాబాద్‌లో ని సిద్ధేశ్వర్ కాలనీలో 19 ఏళ్ల బూర నర్మద మృతి చెందిన ఘటనపై ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 27న రాత్రి సుమారు 7 గంటల సమయంలో నర్మద మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఘటనాస్థలంలో చేతిరాతతో కూడిన ఓ నోట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారు ఇచ్చిన సమాచారం, లభించిన నోట్ ఆధారంగా.. నర్మద సిద్ధార్థ్ బేజని గౌడ్ అనే యువకుడిని ప్రేమించినట్లు, సుమారు 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను మృతి చెందిన అనంతరం ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పోలీ సులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఘటనాస్థలా న్ని పరిశీలించి, సంబంధిత ఆధారాలను సేకరించారు. సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

## సారపాక బూర్గంపాడు రోడ్డు మరమ్మత్తులను చేపట్టాలి

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సిపిఎం బృందం

బూర్గంపాడు: అర్హులైన పేదలకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో బృందం ఫిర్యాదు చేసింది. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా వాణిలో సిపిఎం బృందం పలు సమస్యలపై వినత పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటే శ్వర్లు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మం జూరు చేయాలని ఆయన అన్నారు. పెండిం గ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు. సార పాక -బూర్గంపాడు గ్రామాల మధ్య రహదారి పూర్తిగా గోదావరి వరదలు , అకాల వర్షాలతో పాడైపోయిందని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రజలు ఈ రహదారిపై ప్రయా ణం చేయాలంటే అర చేతిలో ప్రాణాలను పెట్టు కొని ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. తక్ష ణమే ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కళ్యాణ లక్ష్మి పథ కాలలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే వి డుదల చేయాలని ఆయన అన్నారు. వృద్ధాప్య పింఛన్లు,వితంతు పింఛన్లు, వికలాంగుల పింఛన్లు కొత్తవి త్వరగా మంజూరు చేయాలని ఆయన అన్నారు. ప్రభు త్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు పింఛన్లను వెంటనే పెంపు చేయాలని ఆయన అన్నారు. ప్రధానంగా సారపాక -బూర్గంపాడు గ్రామాల మధ్య ఉన్న రహదారి పూర్తిగా పాడైపోవడం వల్ల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ రోడ్డు మరమ్మత్తులపై ప్రభుత్వం దృష్టి నిలపాలని ఆయన అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పార్టీ నాయ కులు బి రాము, కె.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

(అరుణ ప్రభ న్యూస్ – నారాయణఖేడ్) : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం సమీపంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్‌కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నీలం మధు ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధ తదితరులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం పాటించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్న పార్టీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 28న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో పూర్తి విశ్వాసం కలగాలంటే ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలోనే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన వార్తలపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు ఎలాంటి కారణాలతోనూ తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండటంతో పాటు ప్రజలకు సరైన



సమాచారం అందించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంజయ్య, తోపాజీ అనంత కిషన్ సెట్, జిల్లాకు చెందిన మున్సిపల్ ఛైర్మన్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్మాసిటీ రద్దు చేయాలి.. మా భూములు మాకు ఇవ్వాలి

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రజాభవన్ ముట్టడించిన యాచారం ఫార్మా రైతులు..

### హామీ అమలు చేయాలని డిమాండ్




ఇబ్రహీంపట్నం, అరుణప్రభ ప్రతినిధి : యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ యాచారం మండలానికి చెందిన ఫార్మా రైతులు సోమవారం ప్రజాభవన్‌ను ముట్టడించారు. తమ భూముల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రైతులు స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములకు సంబంధించిన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేయడంతో పాటు తమ భూములను తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మాసిటీకి సంబంధించి గతంలో ఇచ్చిన భూములపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు అనుగుణంగా జీవో నంబర్ 31ను అమలు చేసి, భూములను రైతులకు తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. . ఎన్నికల సమయంలో తమ భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు సీతక్క, బట్టి విక్రమార్క, రాజు గోపాల్ గౌడ్, కోదండ రెడ్డి, తీన్మార్ మల్లన్నలు మా వద్దకు వచ్చి తిరిగి భూములు ఇస్తానన్ని హామీ ఇచ్చారు.మూడేళ్లు గడుస్తున్నా తమ సమస్యపై తగిన స్థాయిలో స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. తమ భూముల కోసం ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్నామని, ఇకపై కూడా న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. తమ జీవనాధారమైన భూములను తిరిగి ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. రైతులు పెద్ద సంఖ్యలో ప్రజాభవన్ వద్దకు చేరుకుని తమ డిమాండ్లను వినిపించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఫార్మాసిటీ నిర్ణయంపై స్పష్టత ఇవ్వాలని రైతులు నినాదాలు చేశారు. రైతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

# సేవా స్ఫూర్తితోనే సమాజ అభివృద్ధి

### గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు




గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు--1, 2 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది ఎన్ఎస్–ఎస్ స్వచ్ఛంద సేవకులు, విద్యార్థినులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం, ఉప ప్రిన్సిపాల్ శ్రీమతి కమల క్రిస్టియానా, విద్యా సమన్వయకర్త డా. జె. ఉమారాణి, ఎన్ఎస్ఎస్ యూనిట్--1 కార్యక్రమ అధికారి డా. పి. సౌజన్య, యూనిట్--2 కార్యక్రమ అధికారి డా. కె. సరోజతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు హాజరయ్యారు. స్వచ్ఛంద సేవకులు సీమా బేగం, జైదున్నిసా, సుమయ్యా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రధాన నినాదమైన "నేను కాదు.. మీరు" అనే సేవా స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. సమాజ సేవ, సామాజిక బాధ్యత, సమాజ సంక్షేమం, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడం వంటి ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యాపరమైన జ్ఞానానికే పరిమితం కాకుండా ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు సమాజ సేవలో చురుకుగా పాల్గొని సేవా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్--1 కార్యక్రమ అధికారి డా. పి. సౌజన్య గత ఏడాది ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల వార్షిక నివేదికను సమర్పించారు. సామాజిక అవగాహన, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, జాతీయ సమైక్యత, సమాజ సేవ, యువజన అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు వివిధ సాంస్కృతిక, అవగాహన కార్యక్రమాలను ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యాలు, దేశభక్తి నృత్యాలు, ప్రసంగాలు, పాటలు, సామాజిక అవగాహన నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చెట్ల ప్రాముఖ్యత, మహిళా సాధికారత, దేశభక్తి, సామాజిక బాధ్యత, ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తి, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వంటి సందేశాలను విద్యార్థినులు తమ ప్రదర్శనల ద్వారా అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక అవగాహన పెంపొందించే ఉద్దేశంతో చిత్రకథనం, వ్యర్థాలతో అద్భుత సృష్టి, కృత్రిమ మేధస్సుతో వీడియో, కృత్రిమ మేధస్సుతో కార్టూన్ వంటి నాలుగు వినూత్న పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం, అధ్యాపకులు బహుమతులు అందజేశారు. విజేతలను అభినందించడంతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థినిని వారి ఉత్సాహం, సృజనాత్మకత, చురుకైన భాగస్వామ్యానికి అభినందించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు విద్యార్థినుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు వేదికగా నిలిచాయి. సుమారు 500 మంది విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, బోధనా సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. చివరగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. "నేను కాదు.. మీరు" అనే ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ జీవితంలో కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# వాటర్‌మెన్స్‌ను హెచ్ఎండబ్ల్యూఎస్‌కు బదిలీ చేయొద్దు

### జీహెచ్ఎంసీలోనే కొనసాగించాలి.. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతి

అరుణ ప్రభ – శంషాబాద్ జోన్ : శంషాబాద్, సెప్టెంబర్ 28: దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న తమను జీహెచ్ఎంసీ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్‌కు బదిలీ చేయకుండా జీహెచ్ఎంసీలోనే కొనసాగించాలని శంషాబాద్ ప్రాంత వాటర్‌మెన్స్ ప్రతినిధులు ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. గత 20 నుంచి 26 ఏళ్లుగా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, అనంతరం జీహెచ్ఎంసీలో విలీనమైనప్పటి నుంచి నిరంతరంగా విధులు నిర్వహిస్తున్నామని, ఇన్నేళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ తమకు కనీస ఉద్యోగ భద్రత, శాశ్వత ఉద్యోగ హోదా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ బుక్స్ నిర్వహణతోపాటు కనీస సదుపాయాలు కూడా అందడం లేదని వాపోయారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ఇతర కార్మికులకు ప్రభుత్వం వేతనాలు పెంచుతున్న తరుణంలో వాటర్‌మెన్స్‌ను మాత్రం హెచ్ఎండబ్ల్యూఎస్‌కు బదిలీ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. ఈ నిర్ణయం అమలైతే తమకు తక్కువ వేతనాలు అందే అవకాశం ఉందని, ఇప్పటికే ఎన్నో ఏళుగా పనిచేస్తున్న తమకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలోని ఇతర కార్మికులకు సెప్టెంబర్ నుంచి రూ.19,500 వేతనం అందించాల్సి ఉండగా, వాటర్‌మెన్స్‌కు మాత్రం ఈ వేతన పెంపు వర్తించకుండా హెచ్ఎండబ్ల్యూఎస్‌కు బదిలీ చేయడం అన్యాయమని వారు అభిప్రాయపడ్డారు. తమ సేవలను గుర్తించి ఇతర కార్మికులతో



సమానంగా వేతనాలు పెంచడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని వాటర్‌మెన్స్ ఎమ్మెల్యేను కోరారు. హెచ్ఎండబ్ల్యూఎస్‌కు బదిలీ చేయకుండా జీహెచ్ఎంసీలోనే కొనసాగించాలని, అందరికీ శాశ్వత ఉద్యోగ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్వీస్ బుక్స్ ఏర్పాటు చేసి, విధులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను వాటర్‌మెన్స్ ప్రతినిధులు అభ్యర్థించారు.



## నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి

### శాస్త్రీయ పద్ధతులతో విత్తనోత్పత్తి చేపట్టాలి.. శాస్త్రవేత్తలు ప్రశాంత్, భరత్

అరుణ ప్రభ:– నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవడంతో పాటు శాస్త్రీయ పద్ధతులను పాటించి విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ ప్రాంతీయ విత్తనోత్పత్తి అధికారి డాక్టర్ వై. ప్రశాంత్, భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ టి. భరత్ అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సోమవారం రైతులకు వరి విత్తనోత్పత్తి సాంకేతికతలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీజేటీఏయూ--నాబార్డు--సహకార సంఘాల ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ వై. ప్రశాంత్, డాక్టర్ టి. భరత్ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు విత్తనోత్పత్తి విధానాలపై వివరంగా అవగాహన కల్పించారు. డాక్టర్ వై. ప్రశాంత్ మాట్లాడుతూ వరి విత్తనోత్పత్తి సమయంలో విత్తన రకాన్ని బట్టి తగిన వేరుపాటు దూరాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విత్తన పంటలో ఇతర రకాల మొక్కలు కలవకుండా ఎప్పటికప్పుడు పొలాన్ని పరిశీలించాలని, కల్తీ మొక్కలను గుర్తించి తొలగించాలని వివరించారు. విత్తన పంటను ఎంపిక చేసుకునే దశ నుంచి కోత, నిల్వ వరకు ప్రతి దశలోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ టి. భరత్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ సాంకేతికతలను అవలంబించాలని సూచించారు. పీజేటీఏయూ--నాబార్డు--సహకార సంఘాల ప్రాజెక్టు ద్వారా రైతులను విత్తనోత్పత్తి దిశగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి వాటిని ఇతర రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థానికంగా నాణ్యమైన విత్తనాల లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు తాతారావు మాట్లాడుతూ మంచి దిగుబడులకు నాణ్యమైన విత్తనం ప్రాథమిక అవసరమని అన్నారు. రైతులు విత్తనాల ఎంపికలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## కొంగరకలాను లక్ష్మీనరసింహస్వామి యూత్ అసోసియేషన్ వినాయక లడ్డును 211000 రూపాయలకు కైవసం చేసుకున్న నీళ్ల శంకరయ్య

అరుణప్రభ ఇబ్రహీంపట్నం : కొంగర కలాన్ డివిజన్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి యూత్ అసోసియేషన్ ద్వారక నగర్ కాలనీ గణపతి దగ్గర నవరాత్రులు పూజలు అందు కున్న పెద్ద లడ్డు ని 211000 రు నీళ్ల శంకరయ్య , చిన్న లడ్డుని 46000 కి కాకి విష్ణు వర్ధన్ కైవసం చేసుకోవడం జరిగింది. హోరా హోరీగా జరిగిన లడ్డూ వేలంలో నీళ్ల శంక రయ్య 211000 కైవసం చేసుకున్నారు. 9 నవరాత్రులు పూజలు అందుకున్న వినాయ కుడి లడ్డూ కైవసం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది అని ఈ సందర్భంగా తెలిపారు.



## ఆగాపల్లిలో ఘనంగా మైత్రి యూత్ వినాయక నిమజ్జనం

### తొంబై ఐదు వేల రూపాయలు 95,000/- పలికిన లడ్డు

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : మంచాల మండలం ఆగాపల్లి గ్రామంలోని మైత్రి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టిం చిన వినాయక నిమజ్జనం నిర్వాహ కులు ఘనంగా నిర్వహించారు.ఐజీ సౌండ్, డాన్స్ లతో కన్నుల పండుగగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. అంతకుముందు వినాయకుడి లడ్డు వేలం పాటలో అత్యధిక ధర 95000/రూపాయలకి గ్రామానికి చెందిన కంబాలపల్లి.రమేష్ గారు కైవసం చేసుకున్నారు చిన్న లడ్డూను మైత్రి యూత్ అసోసియేషన్ వారు 21000 రూపాయలు కి కైవసం చేసుకున్నారు.ఈ నిమజ్జన కార్యక్రమంలో గ్రామస్తులు, బస్తీ వాసులు,వివిధ రాజకీయ పార్టీ ల నాయకులు,యూత్ సభ్యులు,మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.




## షాహిద్ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం పోరాడుతాం.

డిండి మండలంలోని సిపిఐ ప్రజాభవన్లో షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్ష కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్,ఎల్మినేటి నరేష్ షాహిద్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి వారు మాట్లాడుతూ డిండి మండలంలోని ప్రజలందరికి షాహిద్ భగత్ సింగ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాతంత్ర పోరాటంలో తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఊరికంబాన్ని ముద్దాడిన గొప్ప విప్లవ వీరుడు షాహిద్ భగత్ సింగ్,బ్రిటిషర్ల గుండెల్లో గుబులు పుట్టించిన వీరుడు భగత్ సింగ్ అని వారు కళలుగన్న ఆశయం కోసం నిత్యం పోరాడుతామని భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తామని యువత అవినీతిపై పోరాటాలు చేయాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు జంగిలి కొండల్,అరుణ్,చింటూ,జంగయ్య,తిర్పత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# లాభాల బాటలో తిమ్మాపూర్ సహకార సంఘం

## సభ్యులకు రూ.79 లక్షల దీర్ఘకాలిక రుణాలు
## 360 టన్నుల యూరియా సరఫరా
## రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రైతులకు మరిన్ని సేవలు అందిస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని లాభాల బాటలో నడిపిస్తున్నామని సంఘం అధ్యక్షుడు రామగిరి సుధీర్‌రావు తెలిపారు. సోమవారం తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంఘం సభ్యులకు రూ.79 లక్షల మేర దీర్ఘకాలిక రుణాలను అందజేశామని తెలిపారు. అలాగే స్వల్పకాలిక రుణాలను కూడా రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. సంఘం పరిధిలోని గ్రామాల్లో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు 360 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు వెల్లడించారు. సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తోందని, రాబోయే రోజుల్లో పరిధిలోని గ్రామాల రైతులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి, మాజీ సంఘం డైరెక్టర్లు గుగులోతు నరహరి, మాలో శ్రీరామ్, కొంపల్లి కళావతి, రణవేణి లక్ష్మణ్, పెంజర్ల నారాయణ, గుగులోతు శ్రీరామ్, అందే గంగవ్వ, జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహమ్మద్ షఫీ యుద్దీన్, సంఘం సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు. సంఘం కార్యదర్శి కొండ శశివర్ధన్ గౌడ్, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# అల్మాస్పూర్ సహకార సంఘం అభివృద్ధికి రైతుల సహకారం అవసరం

## రుణాలను సకాలంలో చెల్లించాలి.. ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందాలి: ఉచ్చిడి మోహన్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు, రైతులు మరింత సహకరించాలని అల్మాస్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం అల్మాస్పూర్‌లోని సంఘ కార్యాలయ భవనంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య మహాజనసభ నిర్వహించారు. సభలో 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 25 వరకు సంఘానికి సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికలను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తయిన ఆడిట్ నివేదికను సభలో సమర్పించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వారి నుంచి విలువైన సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 52 ఏళ్లుగా సహకార సంఘానికి అండగా నిలిచి అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గ సభ్యులు, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ద్వారా రైతులకు పెద్దఎత్తున దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. సంఘం ఆధ్వర్యంలో రెండు పెట్రోల్ బంకులు, మూడు గోదాములు నిర్మించడంతో పాటు దుమాల గ్రామ శివారులో రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి సంఘ అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఎఫ్‌పీవోలలో తమ సహకార సంఘం కూడా ఎంపికైందని, రైతులు రూ.2 వేల చెల్లించి సభ్యత్వం పొందవచ్చని సూచించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అందే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని మోహన్‌రెడ్డి కోరారు. సంఘం 52 ఏళ్ల ప్రస్థానంలో తనకు రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన రైతులు, సంఘ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, కేడీసీసీ బ్యాంకు సిబ్బంది, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహాజనసభలో సంఘ సిబ్బంది, కేడీసీసీ బ్యాంకు మేనేజర్, సూపర్‌వైజర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్ మోటార్ల దొంగ అరెస్ట్

## ఐదు కేసుల్లో నిందితుడి ప్రమేయం..
## రూ.1.13 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
## తొగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. లతీఫ్



గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లాలోని రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ బోర్ మోటార్లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మూడు బోర్ మోటార్లు, దొంగతనాలకు ఉపయోగించిన ద్విచక్ర వాహనం, మోటార్లను విక్రయించగా వచ్చిన నగదు స్వాధీనం చేసుకున్నారు. రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం తొగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. లతీఫ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాయపోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున మొత్తం ఐదు దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా రాయపోల్ గ్రామానికి చెందిన లిలిపురుషోత్తం బాబు (37)లిలిను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల శివార్లలోని రైతుల వ్యవసాయ భూములను లక్ష్యంగా చేసుకుని, తన ద్విచక్ర వాహనంపై వెళ్లేవాడని చెప్పారు. వ్యవసాయ బోర్ మోటార్లను రంపం, పార వంటి పరికరాలతో తొలగించి దొంగిలించి, వాటిని గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించి వచ్చిన డబ్బును వినియోగించేవాడని వెల్లడించారు. రెండు రోజుల క్రితం లింగారెడ్డిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమి నుంచి దొంగిలించిన మోటారును గజ్వేల్‌లోని స్క్రాప్ దుకాణంలో విక్రయించేందుకు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా కొత్తపల్లి ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితుడిని పట్టుకుని తనిఖీ చేయగా, బైక్‌పై బోర్ మోటార్‌తో పాటు రంపం, పార వంటి పరికరాలు లభించాయి. విచారణలో నిందితుడు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇటీవలివరకు గ్రామాల శివార్లలోని వ్యవసాయ భూముల్లో బోర్ మోటార్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రశ్మి పెరుమాళ్, ఐపీఎస్ పర్యవేక్షణలో, గజ్వేల్ ఏసీపీ కె. నర్సింహులు, తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్, రాయపోల్ ఎస్ఐ కె. మానస ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయపోల్ గ్రామ శివారులోని కొత్తపల్లి ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి నిందితుడిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పురుషోత్తం బాబు, తండ్రి బాలరాజు, వయస్సు 37 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం, నివాసం రాయపోల్ గ్రామం, మండలం, సిద్దిపేట జిల్లా. స్వాధీనం చేసుకున్న సొత్తు: మూడు బోర్ మోటార్లు, మోటార్లను విక్రయించగా వచ్చిన రూ.6,000 నగదు, దొంగతనాలకు ఉపయోగించిన ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం, వాహనం విలువ సుమారు రూ.75,000, మోటార్ల విలువ సుమారు రూ.32,000. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.1,13,000గా పోలీసులు తెలిపారు. నిందితుడిపై మొత్తం ఐదు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మాల మహానాడు మండల అధ్యక్షుడిగా దేగల నవీన్ ఏకగ్రీవ ఎన్నిక

## మాల కుటుంబ సభ్యుల ఐక్యతే లక్ష్యం: దాసరి శేఖర్



అరుణ ప్రభ :- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల మాల మహానాడు మండల అధ్యక్షుడిగా దేగల నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్ళపల్లి రవి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దేగల నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన మండల అధ్యక్ష పదవికి పూర్తిగా కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. మాల కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా సమస్య ఎదురైతే వారి సమస్య పరిష్కారానికి ముందుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న జాతీయ అధ్యక్షులు తాళ్ళపల్లి రవి, జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి భద్రాద్రి-ఖమ్మం జిల్లాలోని పాత కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో ముందుగా మండల అధ్యక్షుల నియామకాలను పూర్తి చేస్తున్నామని, త్వరలో గ్రామ, పట్టణ కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.మాల కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా కలిసిమెలిసి ఉండాలని, సంఘం వేసే ప్రతి అడుగు ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి సంఘం తరఫున అండగా నిలిచి, ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకువస్తూ, అందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దేగల నవీన్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, మాల మహానాడు సంఘం సభ్యులు తదితరులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సభ్యులు.. పాల్గొన్నారు.

# సమ్మెట వెంకటేశ్వర్లు కు దక్కిన అరుదైన గౌరవం

## సాహితీ రంగంలో విశిష్ట సేవలకుగాను స్వర్ణ నంది అవార్డు ప్రధానం




అరుణప్రభ 28 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మెగా హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ మెగా ఈవెంట్స్ వారు ప్రతీ సంవత్సరం విద్య, సాహితీ, సాంస్కృతిక, నృత్యం,జర్నలిజం రంగాలలో కృషి చేస్తున్న వారిని రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఎంపిక చేసి స్వర్ణ నంది అవార్డులు, కీర్తి ఐకాన్ అవార్డులు ప్రధానం చేస్తుంటారు. ఈ సంవత్సరము మహబూబాబాద్ జిల్లాకు చెంది విద్యా, సాహితీ రంగాలలో కృషి చేస్తున్న శ్రీ సమ్మెట వెంకటేశ్వర్లు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ని కూడా ఎంపిక చేసి మొత్తం 32 మందికి అవార్డులు ప్రధానం చేయుట జరిగింది. బిర్లా ఆడిటోరియం, కూకట్ పల్లి, హైదరాబాద్ నందు స్వర్ణ నంది అవార్డు ప్రధానం చేశారు. సినీ నటులు గౌతం రాజు , తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ పి రామక్రిష్ణ గౌడ్, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీమతి ఎస్ ఎమ్ రత్న, విశ్వక్ మూవీ డైరెక్టర్ వేణు, జాతీయ కబడ్డీ క్రీడాకారిణి, సినీ యాక్టర్ శ్రీమతి జ్యోత్స్న మరియు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ టీవీ ఆర్టిస్ట్ శిరీషరెడ్డి గారల చేతుల మీదుగా ఈ అవార్డు లను అందచేశారు ఈ సందర్భంగా స్వర్ణ నంది అవార్డు స్వీకరించిన అతనిని మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు స్నేహితులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు



# కీర్తిశేషులు ఇల్లెందుల శంకరయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

## ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం:కాంగ్రెస్ నాయకుడు నక్క రేగొండ గౌడ్

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం కీర్తిశేషులు ఇల్లెందుల శంకరయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నక్క ఎగొండ మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయమని అన్నదానం సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్యులను అభినందించారు, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని, పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజు దాతల సహకారంతో ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద అల్పాహారం అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, అనంతరం ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ మా నాన్న జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, మల్యాల భద్రయ్య, దొంతుల సత్యనారాయణ, కాశీనాథ్, కైలాస ప్రశాంత్, గందె యాదగిరి, సంతోష్, ఇల్లందుల ప్రమీల, ఇల్లెందుల నరేందర్ సువర్ణ, శ్రీనివాస్ రజని, సురేష్ సుధారాణి, వారి కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు



# సీనియర్ సిటిజన్లకు భవనం, ప్రభుత్వ స్థలం కేటాయించాలి

## తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 28: వృద్ధుల సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వెంకటాపూర్ గ్రామ సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ దివ్యజ్యోతికి వినతిపత్రం సమర్పించారు. వెంకటాపూర్ గ్రామంలో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘంలో సుమారు 200 మంది సభ్యులు ఉన్నారని ప్రతినిధులు తెలిపారు. వృద్ధులు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు భవిష్యత్తులో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలం అవసరమని పేర్కొన్నారు. గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో సర్వే నంబర్ 349లో 0.23 గుంటలు, సర్వే నంబర్ 374లో 0.29 గుంటలు, సర్వే నంబర్ 396లో భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వగా మిగిలిన ప్రభుత్వ భూమిని సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. అలాగే వృద్ధులు సేదతీరేందుకు, చెట్ల కింద కూర్చొని సమయం గడిపేందుకు ఉద్యానవనం ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. గ్రామపంచాయతీకి కేటాయించిన లేఅవుట్ స్థలాల్లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని సీనియర్ సిటిజన్ల ఉద్యానవనం కోసం కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం అధ్యక్షుడు కొంపెల్లి నరసయ్య, ప్రధాన కార్యదర్శి మునిగే చంద్రయ్య, ఉపాధ్యక్షురాలు మామిళ్ల లక్ష్మి, సంయుక్త కార్యదర్శి గొట్టె ఎల్లయ్య, కోశాధికారి పొన్నాల రాజయ్య, కార్యవర్గ సభ్యులు దుండిగాల నరసయ్య, పొన్నాల లింగయ్య, వడ్నాల ఎల్లయ్య, గొట్టె దేవయ్య తదితరులు ఉన్నారు.

# సీఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై సోమవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డులోని మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నారని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద వేదిక, పార్కింగ్ ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఈఈని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్‌పీడీసీఎల్ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు అవసరమైన ఇతర విద్యుత్ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల సేవకు రైతులే బలం.. సహకార సంఘానికి రూ.30 కోట్ల టర్నోవర్

## రైతులకు జీవితాంతం రుణపడి ఉంటా: చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: రైతుల సహకారం, పాలకవర్గ సభ్యుల కృషితో ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని సంఘం చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. 14 ఏళ్లపాటు చైర్మన్‌గా రైతులకు సేవలందించే అవకాశం కల్పించిన రైతులు, సంఘ సభ్యులు, పాలకవర్గ సభ్యులకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు అందించడంతోపాటు వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా సంఘాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని తెలిపారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సోమవారం గుండారపు కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య మహాజనసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు సంఘానికి సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికలను సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తయిన తనిఖీ నివేదికను కూడా సభ ముందుంచారు. సభ్యులు లేవనెత్తిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్, మాజీ తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహకారంతో సంఘానికి పెద్ద ఎత్తున దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయించగలిగామని తెలిపారు. రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడంతోపాటు సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో సంఘం రూ.30 కోట్ల టర్నోవర్ సాధించడంతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏ ప్లస్ గ్రేడ్‌తో తొలి పది స్థానాల్లో గుర్తింపు పొందిందని వివరించారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సహకారంతో సంఘం పరిధిలో రెండు గోదాములు, పెట్రోల్ బంకు, కార్యాలయ భవనం, బ్యాంకు భవనం నిర్మించుకున్నామని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకున్నామని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను యాప్ ద్వారా కాకుండా నేరుగా అందించేలా మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

గత 14 ఏళ్లుగా తనకు అండగా నిలిచిన రైతులు, సంఘ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులకు కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు గొట్టె సరిత, దొమ్మాటి నర్సయ్య, ల్యాగల సతీష్, నెవూరి వెంకట నరసింహారెడ్డి, గంద్ర ప్రభాకర్‌రావు, కస్తూరి రామచంద్రారెడ్డి, సంఘ కార్యదర్శి అజయ్‌కుమార్, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

### 52 ఏళ్ల ప్రస్థానంలో మరో ముందడుగు.. అల్మాస్పూర్ సహకార సంఘానికి మూడు గోదాములు

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: రైతుల సంక్షేమమే లక్ష్యంగా అల్మాస్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 52 ఏళ్లుగా సేవలందిస్తోందని సంఘం చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి అన్నారు. రైతులకు అవసరమైన రుణాలు అందించడంతోపాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడేలా సంఘం ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సంఘ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న రైతులు, సభ్యులు, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అల్మాస్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సోమవారం ఉచ్చిడి మోహన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 25 వరకు సంఘానికి సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికలను సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తయిన తనిఖీ నివేదికను కూడా సభ ముందుంచారు. సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పెద్ద ఎత్తున మంజూరు చేయించేందుకు కృషి చేశామని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో రెండు పెట్రోల్ బంకులు, మూడు గోదాములను నిర్మించామని వివరించారు. రైతులకు మరిన్ని సేవలు అందించడంతోపాటు సంఘ కార్యకలాపాలను విస్తరించేందుకు దుమాల గ్రామ శివారులో రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అక్కడ సంఘ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థల్లో తమ సహకార సంఘం కూడా స్థానం సంపాదించిందని మోహన్‌రెడ్డి తెలిపారు. రైతులు రూ.2,000 చెల్లించి సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు. సంఘం నుంచి రుణాలు పొందిన రైతులు వాటిని నిర్ణీత గడువులోగా సకాలంలో చెల్లించాలని సూచించారు. రుణాల తిరిగి చెల్లింపుతో సంఘం ఆర్థికంగా బలోపేతం కావడమే కాకుండా, ఇతర రైతులకు కూడా రుణాలు అందించే అవకాశం కలుగుతుందని వివరించారు. ప్రభుత్వం ద్వారా అందే రైతు ప్రయోజనాలను పొందేందుకు కూడా సంఘ సభ్యులు సహకరించాలని కోరారు. రైతులు సంప్రదాయ పంటలతోపాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. 52 ఏళ్లుగా సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న రైతులు, సభ్యులు, పాలకవర్గ సభ్యులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు, సిబ్బంది, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, సంఘ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మేనేజర్, పర్యవేక్షకుడు, సంఘ సభ్యులు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# బ్యాంకు, ఏటీఎం ఏర్పాటు చేయాలి

## క్రైస్తవుల సమాధుల తోటకు స్థలం కేటాయించాలి

## ప్రజావాణిలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ వినతి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీ ఏరియాలో బ్యాంకుతో పాటు ఏటీఎం సౌకర్యం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నోడల్ అధికారి సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. గాంధీ ఏరియా పరిసరాల్లో నివసించే ప్రజలు బ్యాంకు లావాదేవీల కోసం బస్టాండ్ ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా పెన్షన్‌దారులు, మహిళా సంఘాల సభ్యులు నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం దూరం వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంటనే స్పందించి గాంధీ ఏరియాలో బ్యాంకు శాఖతో పాటు ఏటీఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నివసిస్తున్న క్రైస్తవ మతస్థుల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాలరాజు యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి క్రైస్తవుల సమాధుల తోట కోసం స్థలం కేటాయించాలని కోరారు. ప్రజల మౌలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మాదకద్రవ్య రహిత యువతతోనే దేశ ప్రగతి

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలి.




ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 28 (అరుణప్రభ): మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతోపాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు అన్నారు. భారతదేశ అభివృద్ధికి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకరమైన యువత అవసరమని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం "నషా ముక్తి యువ ఫర్ భారత్ వికసిత్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు చేతుల్లో నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని యాంటీ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కళాశాల ఇన్‌చార్జి క్యాతం సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలను పూర్తిగా విడనాడి, శ్రమజీవనానికి అలవాటు పడాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు, గురువులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, గజ్జెల గంగాధర్, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# గొర్రెల కాపర్లు-ఫారెస్ట్ బీట్ అధికారి మధ్య ఘర్షణ



## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు.. పోలీసులకు ఫిర్యాదు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో గొర్రెల కాపర్లు, ఫారెస్ట్ బీట్ అధికారి మధ్య జరిగిన ఘర్షణ కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానికుల సమాచారం ప్రకారం.. ఫారెస్ట్ బీట్ అధికారి వేణు కారులో రోడ్డుపై వెళ్తుండగా, అదే సమయంలో గొర్రెలను మేపుకుంటూ వెళ్తున్న కాపర్లు కారును నెమ్మదిగా నడపాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రోడ్డుపై గొర్రెలను ఎందుకు మేపుతున్నారంటూ అధికారి ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. వాగ్వాదం కాస్త తీవ్రరూపం దాల్చడంతో పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇరువర్గాలకు గాయాలైనట్లు సమాచారం. అనంతరం గొర్రెల కాపర్లు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి ఘర్షణకు దారితీసిన కారణాలు, ఘటనలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.



# కాంపల్లి గ్రామంలో పల్లె ధవాఖాన

## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్

సీరోల్ / అరుణ ప్రభ : మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండల కాంపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో గ్రామస్తులకు టీబీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో, కురవి ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ మరియు ఆశా వర్కర్ల సహకారంతో ఈ వైద్య శిబిరం జరిగింది. గ్రామానికి చెందిన వృద్ధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలుచేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని, టీబీ లక్షణాలు ఉంటే వెంటనే పల్లె దవాఖానను సంప్రదించాలన సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక ల్యాబ్ టెక్నీషియన్ హెల్త్ అసిస్టెంట్ ఆశా వర్కర్స్ గ్రామ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## బొప్పాపూర్‌లో రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని రామ భిక్షపతి వాటర్ ప్లాంట్ ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గంభీరావుపేటకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన వ్యక్తి పరిస్థితి, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.




## చెరుకుపల్లిలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహణ

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 28,ఐసిడిఎస్ దేవరకొండ ప్రాజెక్టు పరిధిలోని దిండి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెక్టార్ సూపర్వైజర్ ఎం రేణుక మాట్లాడుతూ ,అంగన్వాడి కేంద్రంలో ఒక పూట సంపూర్ణ భోజనము ,ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందించబడుతుందని, గర్భిణీ బాలింతలు మూడు సంవత్సరాల పిల్లలకు అందరూ వినియోగించుకోవాలని చెప్పారు.ఐరన్, కాల్షియం లోపం రాకుండా రాగి జావా, బెల్లం ,పల్లీలు, ఆకుకూరలు ,సీజన్స్ పండ్లు, తినడం తల్లిదండ్రులు పిల్లల ఆహారంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, కార్యదర్శి చిరంజీవి, అంగన్వాడి టీచర్ పార్వతమ్మ, ఆశా వర్కర్, వార్డు సభ్యులు ,,కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పీజీ మెడికల్ విభాగంలో ప్రతిభ చూపిన జ్యోతిర్మయికి వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

అరుణప్రభ 28 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : ఇటీవల దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ విభాగ ఫలితాలు వెలవడగగా మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన ఈగ శ్రీనివాస్ రమ్య దంపతుల పుత్రిక జ్యోతిర్మయి 7326 ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే ఇందులో భాగంగా ప్రముఖ సేవా సంస్థ అయిన వాసవి కపుల్స్ క్లబ్ వారు డాక్టర్ ఈగ జ్యోతిర్మయిని ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జంగాల విజయకుమార్ మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే పీజీ ర్యాంకు కొట్టడం అభినందనీయమని భవిష్యత్తులో వైద్య రంగంలో రోగులకు నాణ్యమైన చికిత్స చేస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకొని తల్లిదండ్రులకు గుర్తింపుని ఇవ్వాలని కష్టానికి తగ్గ ఫలితం వచ్చినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిదని అన్నారు సన్మాన కార్యక్రమాన్ని ఉద్దేశించి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ మాలే యోగేశ్వరరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో జాతీయస్థాయిలో మెడికల్ పీజీ విభాగంలో ఇంతటి ర్యాంకు సాధించడం హర్షించాల్సిన విషయం అని నేటి విద్యార్థులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని వారి వారి రంగంలో రాణించాలని అతను అన్నారు ప్రధాన కార్యదర్శి ప్రతాపని శ్రీధర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ డాక్టర్ జ్యోతిర్మయి చిన్నతనం నుండే కష్టపడి చదివి ప్రాథమిక స్థాయి నుండి నేటి వరకు ప్రథమ స్థానము దక్కించుకునేదని తన మొక్కవోని దీక్షతోటే ఇంతటి కీర్తి సాధ్యమైందని అన్నారు అలాగే సన్మాన గ్రహీత డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ వైద్యరంగంలో కొంతమంది మాత్రమే పోవడానికి ఇష్టం చూపుతున్న తరుణంలో నేడు ఆర్యవైశ్యులు కూడా అన్ని రంగాలలో రాణించడం శుభప్రదమని వైద్యరంగంలో కూడా ఇటీవల కాలంలో మన వైశ్యులు రాణిస్తున్నట్లు తెలిపింది అలాగే తాను ఎంబిబిఎస్ సాధించినప్పుడు కూడా వాసవి కపుల్స్ క్లబ్ వారు మరియు ఎంతోమంది ఆర్యవైశ్య ప్రముఖులు తనని ప్రోత్సహించి సన్మానించి ముందుకు నడిపించారని మీ అందరి ప్రోత్బలంతోనే ఇంతటి ఘనత సాధ్యమైందని ఆమె అన్నారు కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# వదంతులను నమ్మవద్దు.. విద్యార్థుల్లో ఎలుకలు కరిచిన ఆనవాళ్లు లేవు

**సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సందర్శించిన**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**విద్యార్థుల ఆరోగ్యంపై క్షుణ్ణంగా ఆరా తీసిన కలెక్టర్**
**పాలకుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : సోమవారం, జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్ ప్రకాష్ తో కలిసి కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, ఈ నెల 22న విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు వచ్చిన సమాచారంపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులను ఉద్దేశించి భోజనం ఎలా ఉంది? ఆరోగ్యం ఎలా ఉంది? రాత్రి సమయంలో జ్వరం వస్తుందా? ఎలుకలు కరిచినట్లు మీరు వాటిని చూసారా? మీ పేరు ఏమిటి? మీ అమ్మానాన్న పేర్లు? వారు ఏం చేస్తారు? ఏ ఊరు? టీకాలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. అలాగే విద్యార్థుల కాళ్లు, చేతులను నిశితంగా పరిశీలిస్తూ, ఏ సమయంలో జరిగింది? ఆ సమయంలో రక్తం వచ్చినట్లు అనిపించిందా? నొప్పిగా ఏమైనా ఉందా? అని వివరాలు తెలుసుకున్నారు.దీనిపై స్పందించిన విద్యార్థులు.. తమకు జ్వరం లేదని, రక్తం కూడా రాలేదని, భోజనం మంచిగా ఉందని, ఆరోగ్యం బాగుందని కలెక్టర్ కు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్.మాట్లాడుతూ. వదంతులను నమ్మవద్దని పేర్కొన్నారు. విద్యార్థులను పరిశీలించిన అనంతరం ఎలుకలు కరిచిన ఆనవాళ్లు ఏవీ లేవని, వారి చేతులు, కాళ్లపై ఎటువంటి గీతలు కూడా కనిపించలేదని తెలిపారు.అనంతరం పాఠశాలలోని భోజన గది, సరుకుల నిల్వ గది, వంటశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితర ప్రాంతాలను కలియతిరిగి విస్తృతంగా పరిశీలించారు. విద్యార్థుల మంచాలను కూడా తనిఖీ చేశారు.పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత విషయంలో పంచాయతీ కార్యదర్శిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, పనికిరాని వస్తువులను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని, నిల్వ లేకుండా తాజా కూరగాయలతో ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదే విధంగా అనుమతి లేకుండా బయటి వ్యక్తులను పాఠశాల లోపలికి రానివ్వకూడదని స్పష్టం చేశారు.ఎంపిడిఓ, తహసీల్దార్ లు పాఠశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు సయానుగుణంగా ఆహారం తీసుకోవాలని, బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ప్రోత్సహించారు.ఈ పర్యవేక్షణలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేదవతి, వైస్ ప్రిన్సిపల్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

# వదంతులను నమ్మవద్దు.. విద్యార్థుల్లో ఎలుకలు కరిచిన ఆనవాళ్లు లేవు

**8 వేల ఎకరాల ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.**
**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య.**
**నేతన్నలు, రైతులు, మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి.**
**కొండూరు రవీందర్‌రావు.**



సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (ఎల్లారెడ్డిపేట అరుణప్రభ): సీఎం హోదాలో తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో న్యాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ప్రజల గుండెల్లో మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారని, ఆయన హయాంలో సిరిసిల్లలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలుసని తోట ఆగయ్య అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎన్నికల సభకు వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు వస్తున్నందున, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూములపై ఆరోపణలు చేసి, 2,400 ఎకరాలు రికవరీ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని తోట ఆగయ్య అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరూపించలేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. నేతన్నలకు మేలు చేసేలా వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం హోదాలో సిరిసిల్లకు వచ్చినప్పుడు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు బదులుగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలని అన్నారు.

**రైతులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి**

న్యాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో సిరిసిల్లకు ఏం చేసిందో ముఖ్యమంత్రి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన 27 మంది కౌన్సిలర్లను ప్రజలు గెలిపించారని, కాంగ్రెస్ తరఫున గెలిచిన కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్మికులు, రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కాపేట రిజర్వాయర్‌ను పూర్తి చేసి, అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని తరలించేలా చర్యలు చేపట్టామని రవీందర్‌రావు తెలిపారు. మిగిలిన పనులను ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. రైతు బంధు కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున అందించాలని, రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తూ ప్రీమియం చెల్లించి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మధ్యమానేరు ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. మధ్యమానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధ్యమానేరు తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టు అని, ఇక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని తరలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, న్యాలకొండ రాఘవరెడ్డి, కంబాల మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజు యాదవ్, కౌన్సిలర్లు, మధ్యమానేరు గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# దళిత హత్యలపై ప్రత్యేక విచారణ జరపాలి

**మామిళ్లకుంట క్రాస్ నుంచి రెవెన్యూ భవన్ వరకు బీఎస్పీ ర్యాలీ.. భారీ ధర్నా**



పుట్టపర్తి, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, వేధింపులు, లాకప్ హింసకు నిరసనగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తిలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మామిళ్లకుంట క్రాస్ నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సాకే వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై వరుసగా దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ప్రస్తుత టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం దళితుల విషయంలో ఒకే విధమైన వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఈ నెల 9న నిర్వహించిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. మడకశిరకు చెందిన దళిత యువకుడు విజయభాస్కర్ హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని కోరారు. 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన 27 దళిత హత్యలు, అనుమానాస్పద మరణాలపై ప్రత్యేక విచారణ సంస్థతో లేదా సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో కాలపరిమితితో కూడిన నిష్పాక్షిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హత్యలు, దాడులకు గురైన ప్రతి దళిత బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం, మూడు ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయడంతో పాటు బాధిత కుటుంబాలు, సాక్షులకు పూర్తి పోలీసు రక్షణ కల్పించాలని బీఎస్పీ నాయకులు కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు శ్రీరాములు, అంపావతి గోవిందు, జిల్లా అధ్యక్షులు సాకే వినయ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు వాల్మీకి ప్రసాద్, మాల్యవంతం రాంప్రసాద్, నాయకులు ఖాదర్ భాషా, ఇందీవర్, సాకే కుళ్లాయప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని

**కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ శ్రేణులు**



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రం జనగామ జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఏఐసీసీ,టీపీసీసీ ఆదేశాల మేరకు జనగామ నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్రెడ్డి పిలుపుతో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.డీసీసీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో సమావేశమై అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే,మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి,పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం జనగామ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ ముందుకు సాగగా, కలెక్టర్ కార్యాలయం వద్ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.తదనంతరం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి,నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకవత్ ధన్వంతి లక్ష్మీనారాయణ,పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి,కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగానే జనగామ కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించామని,ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జులు,గ్రంథాలయ చైర్మన్లు,మున్సిపల్ చైర్మన్లు,వైస్ చైర్మన్లు,ఏఎంసీ చైర్మన్లు,వైస్ చైర్మన్లు, బ్లాక్ రాపాక సత్యనారాయణ, మార్కెట్ చైర్మన్ లవడియా మంజుల భాస్కర్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోగు శ్రీనివాస్,,సర్పంచులు,గ్రామ పార్టీ అధ్యక్షులు,పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు,యువజన నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మాదంశెట్టి వెంకన్న



అరుణ ప్రభ పాలకుర్తి, సెప్టెంబర్ : పాలకుర్తి మండలం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మాదంశెట్టి వెంకన్న నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నిర్వహించిన వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, వాసవి సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మంకాళి విజయ్ కుమార్ చేతుల మీదుగా మాదంశెట్టి వెంకన్న నియామక పత్రాన్ని స్వీకరించారు. రాష్ట్రస్థాయిలో వాసవి సేవాదళ్ కార్యక్రమాలను విస్తృతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు, సేవా కార్యక్రమాల సమన్వయంలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.వాసవి సేవాదళ్ ద్వారా సమాజ సేవ, సేవా కార్యక్రమాలు, ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. వెంకన్నకు రాష్ట్రస్థాయి బాధ్యతలు దక్కడంపై పాలకుర్తి మండలానికి చెందిన ఆర్యవైశ్య సంఘాల నాయకులు, వాసవి సేవాదళ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.తనను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించేందుకు సహకరించిన జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, జనగామ జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు నాగమళ్ళ సోమేశ్వర్ జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మరియు పాలకుర్తి మండల ఆర్యవైశ్య నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

అరుణ ప్రభ, నల్లగొండ, సెప్టెంబర్ 28 ,బిజెపి చేతిలో కీలుబొమ్మలా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాల నే ప్రధాన డిమాండ్తో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు .ఈ కార్యక్రమం డిసిసి అధ్యక్షులు చిన్న కైలాస్ నేత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడు హక్కు అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు సురక్షితంగా ఉండేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఎమ్మెల్యే అన్నారు .ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ధర్నా అనంతరం సి ఈ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు.



## జనగామ జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షుడిగా చెల్లోజు నవీన్ చారి, ఉపాధ్యక్షుడిగా వర్ధమాన్ శ్రీనివాస్**

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్ర జనగామ జిల్లా తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ జనగామ జిల్లా నూతన అధ్యక్షుడిగా చెల్లోజు నవీన్ కుమార్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మలూరు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఆయనకు నియామక పత్రం అందజేశారు. జర్నలిస్టులు ఐక్యతతో తమ హక్కులను సాధించుకోవాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా బతోజు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా దిగోజు సాంబయ్య, కోశాధికారిగా సాతెల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి మండల కేంద్రం విసునూరు గ్రామ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు టీవీ 5 రిపోర్టర్ వర్ధమాన్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఇలా సోమ నరసింహ చారి, సూతోజు వీరాచారి, ప్రచార కార్యదర్శిగా చెన్నోజు సాహిత్ కుమార్, గౌరవ సలహాదారుడిగా శశిధర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు ఓదెలసత్యనారాయణ,కొండపర్తి విష్ణుమూర్తి చారి,అలుగూరి హరినాథ్ బాబు, కలకోటి వీరభద్ర చారి ,అబ్బోజు యాకస్వామి, గుడి కందుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృతం చేయాలి

అరుణప్రభ 28 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మహబూబాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కమిటీ మెంబర్ మరియు జిల్లా డైరెక్టర్, రావుల రవిచందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఇరువురుకి శుభాకాంక్షలు తెలిపి రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేయాలని ప్రజాసేవలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆమె అన్నారు మాజీ ఎంపీ కవిత మాలోత్. కార్యక్రమంలో ముత్యం వెంకన్న గౌడ్ మహబూబ్ పాషా నల్లని నవీన్ రావు ఆగే వెంకన్న మనాది రాజేష్ ఉన్నారు

# రాయిని చెరువుకు నీళ్లెప్పుడు?

**9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి. మద్దిమల్ల రైతుల ఆవేదన.**

**సాగునీటి కోసం మద్దిమల్ల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు బీజేపీ రైతు పాదయాత్ర.**

**ప్రభుత్వాలు మారుతున్నా.. రైతుల కష్టాలు తీరడం లేదన్న రెడ్డబోయిన గోపి**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: చెరువు ఉంది.. కాలువ ఉంది.. ప్రాజెక్టు ఉంది.. కానీ రైతు పొలానికి మాత్రం నీరు రావడం లేదు. ఏళ్లుగా 9వ ప్యాకేజీ పనులు పూర్తికాక మద్దిమల్ల రాయిని చెరువు ఎండిపోవడంతో పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయని బీజేపీ నాయకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో సోమవారం మద్దిమల్ల నుంచి వీర్నపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు రైతు పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి నాయకత్వంలో జరిగిన ఈ పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవాపురం లక్ష్మీ నరసయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, రైతులు పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రైతుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

**రాయిని చెరువు ఎండిపోతుంటే కాళేశ్వరం గొప్పలెందుకు?**

ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని గతంలో గొప్పలు చెప్పుకున్న పాలకులు మద్దిమల్లలో ఎండిపోయిన రాయిని చెరువును, నీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల పొలాలను పరిశీలించాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం రైతులకు నీరు అందించడమే అయితే రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులకు సాగునీరు ఎందుకు అందడం లేదని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మద్దిమల్లకు వచ్చి రాయిని చెరువు పరిస్థితిని, రైతుల ఇబ్బందులను పరిశీలించాలని కోరారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు నీరు అందించాల్సిన పైప్‌లైన్ పనులు కంచర్ల అటవీ ప్రాంతంలో ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానిదీ అదే నిర్లక్ష్యమా?**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా గోపి ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎల్లారెడ్డిపేట పర్యటనలో 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదని కాంగ్రెస్ చెబుతోంది.. మరి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇంతకాలం అయినా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదు? రైతుకు మాత్రం నీళ్లు ఎక్కడ?" అని ప్రశ్నించారు. రైతులకు రాజకీయ విమర్శలు అవసరం లేదని, పొలాల్లో నీరు.. చెరువుల్లో నీరు.. పంటలకు భరోసా కావాలని గోపి అన్నారు.

**రైతుల కోసం పోరాటం కొనసాగుతుంది**

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవాపురం లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ రైతు పంట పండించాలంటే ముందుగా సాగునీరు అవసరమన్నారు. నీటి కోసం రైతులు రోడ్లపైకి వచ్చి పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు. 9వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేసి మద్దిమల్ల రాయిని చెరువుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీజేపీ ప్రకటనలకు పరిమితం కాదని, అవసరమైతే మరింత పెద్ద ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

**హామీలు నిలబెట్టుకోవాలి**

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు విస్మరించకూడదన్నారు. 9వ ప్యాకేజీ పూర్తయితే ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిసినా పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వం మరో ప్రభుత్వంపై నెపం వేసి రైతుల సమస్య నుంచి తప్పించుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పెండింగ్‌లో ఉన్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వమే నిలబెట్టుకోవాలని అన్నారు.

**నాలుగు ప్రధాన డిమాండ్లు**

బీజేపీ నాయకులు ప్రభుత్వం వెంటనే 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని, మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు నీరు అందించే పనులు చేపట్టాలని, మద్దిమల్ల రాయిని చెరువుకు సాగునీరు అందించాలని, పంట నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. "రాయిని చెరువులో నీరు నిండే వరకు.. రైతు పొలాల్లో పచ్చదనం వచ్చే వరకు.. 9వ ప్యాకేజీ పనులు పూర్తయ్యే వరకు బీజేపీ రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుంది" అని రెడ్డబోయిన గోపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి జలపతి రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సాబీర్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, వీర్నపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు లకుపతి నాయక్‌తో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

**కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.. ఆహారం, పారిశుధ్యం, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



అరుణప్రభ – మహబూబాబాద్ అర్బన్, సెప్టెంబర్ 28: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతోపాటు మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఆహార నాణ్యత, పారిశుధ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కలెక్టర్లు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార పదార్థాల తయారీ, నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అవసరమైన చోట వంటశాలలను ఆధునీకరించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్నానానికి వెచ్చని నీరు, అవసరమైన దుప్పట్లు ముందుగానే అందుబాటులో ఉంచాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టేలా భవన యజమానులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందించడంతోపాటు, విద్యార్థులకు అందించే సౌకర్యాల వివరాలను డ్యాష్‌బోర్డు, సమగ్ర సమాచార వేదికలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ లక్ష యూనిఫారాలు కుట్టే లక్ష్యాన్ని సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ శాఖలకు చెందిన 123 వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సమయాల్లో వసతి గృహాలను సందర్శించి, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. ఫిర్యాదుల పెట్టెలను నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వారి మానసిక ఆరోగ్యాన్ని గమనిస్తూ అవసరమైన చోట వైద్యుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలిపారు. వసతి గృహాల పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వసతి గృహాల్లో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనకు ఫోన్ లేదా సందేశం ద్వారా తెలియజేయాలని ఆర్సీవోలు, డీసీవోలకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాములు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీ రామ్‌నాయక్, శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ఆర్సీవోలు, డీసీవోలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న మానస నాట్య ప్రదర్శన



ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని కళాజ్యోతిలో నిర్వహిస్తున్న శతవార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మానస నృత్య కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. భాను, మైత్రి, సంధ్యశ్రీ, కావ్యశ్రీ, శాన్వి స్వరూప్, రిత్విక, భావన, మేఘసాయి తదితరులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం నృత్య గురువు మానసను ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, డీఎస్పీ బి.వి.జగన్నాథరాజు ఘనంగా సత్కరించారు. శిష్య బృందానికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా గురువు మానస మాట్లాడుతూ.. కళాజ్యోతి శతవార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. తమ బృందానికి అవకాశం కల్పించిన కళాజ్యోతి కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రీవెన్స్ డేకు ఆరు దరఖాస్తులు

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు డివిజన్ పరిధి నుంచి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో రామభూపాల్‌రెడ్డి తెలిపారు. వీటిలో ఆర్ఓఆర్ ఎన్‌క్రోచ్‌మెంట్స్‌కు సంబంధించి ఐదు, సర్వే సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఒక దరఖాస్తు ఉన్నట్లు పేర్కొన్నారు. బత్తలపల్లి నుంచి రెండు, ధర్మవరం నుంచి ఒకటి, రామగిరి నుంచి రెండు, తాడిమర్రి నుంచి ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్లు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ధర్మవరం పురపాలక సంఘం కౌన్సిల్ హాలులో సోమవారం పీఎం స్వనిధి లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం స్వనిధి ద్వారా లభించే రుణాలు, వాటి ప్రయోజనాలు, డిజిటల్ లావాదేవీలపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.వెంకట రమణయ్య, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.నాగరాజు, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పెనుబోలు విజయ్ భాస్కర్, మెప్మా ఇన్‌చార్జి సీఎంఎం బి.లక్ష్మీనారాయణ, సీఓలు, ఆర్పీలు, సంఘ సభ్యులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు. వీధి వ్యాపారులు పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని అధికారులు సూచించారు. అర్హులైన ప్రతి వీధి వ్యాపారి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



## శివనామస్మరణతో మార్మోగిన శివపరాశక్తి పీఠం
## భక్తిశ్రద్ధలతో పరమశివునికి విశేష అభిషేకాలు..
### ::: సప్త హారతులతో ఆధ్యాత్మిక వైభవం

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: పవిత్ర సోమవారం సందర్భంగా రాచర్ల బొప్పాపూర్‌లోని శివపరాశక్తి పీఠంలో పరమశివునికి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీశ్రీ మనోహర్ రాజు గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం ప్రత్యేకతను పురస్కరించుకుని శివయ్యకు పంచామృతాలు, గంధం, భస్మంతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల శివనామస్మరణల మధ్య స్వామివారికి సప్త హారతులు సమర్పించారు. పూజా కార్యక్రమాలతో పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పరమశివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలపై శివయ్య కృపాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం పీఠం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు శ్రీశ్రీ మనోహర్ రాజు గురూజీ ఆశీస్సులు అందజేశారు. శివపరాశక్తి అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## కంచర్లలో ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభ
### జల సంరక్షణ, పండ్ల తోటలు, పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: కంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపునకు ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ సామల్ల దేవరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభకు గ్రామస్తులు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామసభలో వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఫామ్ పాండ్స్ ఏర్పాటు, చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు వంటి పనులను గుర్తించారు. అదేవిధంగా వ్యక్తిగత భూముల్లో పండ్ల మొక్కల పెంపకం, నరేగా ప్లాంటేషన్, పశువుల షెడ్ల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను కూడా చేపట్టేందుకు అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఈ సమావేశానికి గ్రామ ఏపీవో మారోజు శ్రీహరి, టీఏ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు, వీఓఏలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి వాటిని ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు గ్రామసభలు కీలకమని పేర్కొన్నారు.



## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు

అరుణప్రభ 28 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పట్టణంలో కళ్యాణ్ ఫెర్టిలైజర్స్, రైతుమిత్ర అగ్రిమల్ ,సత్యనారాయణ ట్రేడర్,శ్రీ వేంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాలపై మహబూబాబాద్ డివిజన్ ఏడిఏ అజ్మీర శ్రీనివాసరావు మండల వ్యవసాయ అధికారి ఎన్.తిరుపతి రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు .మహబూబాబాద్ ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో నాసిరకం ఎరువులు అమ్మకుండా తనిఖీ లు నిర్వహిస్తున్నామని, రైతులు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు పురుగుమందులు కనుగోలు చేయాలని, లైసెన్స్ లు లేని నాసిరకం ఎరువులు కనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ఆన్లైన్లో అఫ్లైన్ నమోదు చేసుకోగలరు
### డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



సీరోల్ /అరుణ ప్రభ : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ నూతన ఓటర్ల నమోదు (De-novo) ప్రక్రియ ప్రారంభమైనది. అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ – డోర్నకల్ మండలం తరపున కోరుతున్నాము. అర్హతలు: 01.11.2023 నాటికి లేదా అంతకంటే ముందు డిగ్రీ / పట్టా పూర్తి చేసి ఉండాలి (01.11.2026 నాటికి మూడేళ్లు పూర్తి కావాలి). ముఖ్యమైన తేదీలు: దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: 28.09.2026 చివరి తేదీ: 06.11.2026 తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాల్సిన పత్రాలు (ఫ్రీశీతీఎ–18 తో పాటు): 1. డిగ్రీ ఒరిజినల్ ప్రొవిజనల్ / కాన్వొకేషన్ సర్టిఫికేట్ కాపీ (గెజిటెడ్ అధికారి / తహసీల్దార్ అటెస్టేషన్ తో) 2. ఆధార్ కార్డ్ కాపీ 3. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో 4. చిరునామా ఆధార పత్రం (ఓటర్ ఐడీ / రేషన్ కార్డ్ / గ్యాస్ బిల్) అప్లై చేయు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా నేరుగా డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫ్రీశీతీఎ–18 నింపి అవసరమైన పత్రాలు జతచేసి సమర్పించవచ్చు. లేదా ఆన్‌లైన్ లో https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టభద్రులారా! మీ ఓటు హక్కు మన ప్రాంత అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలానికి ఎంతో కీలకం. ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే మీ ఓటును నమోదు చేసుకోండి. నమోదు ప్రక్రియలో ఏమైనా సందేహాలు లేదా సహాయం కావాలంటే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను/నాయకులను సంప్రదించగలరు.

## చెరువు మధ్యలో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు.

### తెప్పపై వెళ్లి 11 కేవీ లైన్‌కు మరమ్మతులు చేపట్టిన విద్యుత్ సిబ్బంది



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం గంబీరావుపేట మండలంలో విద్యుత్ సిబ్బంది సాహసం చేశారు. గంభీరావుపేట నుంచి దమ్మన్నపేటకు వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమస్యను గుర్తించేందుకు విద్యుత్ సిబ్బంది తనిఖీలు చేపట్టగా, నమాజ్ చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం వద్ద సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వెనుకడుగు వేయకుండా తెప్పపై చెరువు మధ్యకు వెళ్లిన సిబ్బంది, విద్యుత్ స్తంభంపైకి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. అప్రమత్తంగా, ప్రమాదకర పరిస్థితుల్లో సైతం సాంకేతిక లోపాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా కోసం చెరువు మధ్యకు వెళ్లి మరమ్మతులు చేపట్టిన సిబ్బంది అంకితభావం, సాహసాన్ని స్థానికులు అభినందించారు.



## భగత్‌సింగ్ బాటలో యువత సాగాలి

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్ గొప్ప విప్లవ యోధుడని అన్నారు. దోపిడీ, అసమానతలు తొలగిపోయి ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సామాజిక న్యాయం అందాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. భగత్‌సింగ్ జీవితం, ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని యువత ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు సాగాలని, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.హెచ్.భాష, పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల చివరి విడత బిల్లులను వెంటనే విడుదల చేయాలి

### డిమాండ్ చేసిన బిజెపి రాష్ట్ర కౌన్సిల్ క్యాచువల్ శ్యాం సుందర్ శర్మ



అరుణప్రభ 28 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మొదటి విడతగా ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులు ఇండ్లను కట్టడం పూర్తిచేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికి చివరి విడత బిల్లులను ఇవ్వకుంటా వారిని ప్రభుత్వం ఇబ్బంది పెడుతుంది అని విమర్శించారు మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసిన లబ్ధిదారులను గుర్తించి వెంటనే వారి చివరి బిల్లును ప్రభుత్వం విడుదల చేయాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు

## ఘనంగా ముగిసిన కళాజ్యోతి శతవార్షికోత్సవ వేడుకలు



ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న కళాజ్యోతి శతవార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 26 నుంచి 28 వరకు కళాజ్యోతి కార్యవర్గం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కళాజ్యోతి అధ్యక్షులు కుంటిమల నారాయణ, కార్యదర్శి బాలకొండ రామకృష్ణ మాట్లాడుతూ.. తొలిరోజు మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారని తెలిపారు. రెండో రోజు భారతీయం ధర్మపురి క్షేత్ర వ్యవస్థాపకులు గొట్టిపాటి సత్యవాణి, డీఎస్పీ జగన్నాథరాజు పాల్గొనగా.. మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ గజల్ గాన కచేరీ నిర్వహించారని పేర్కొన్నారు. చివరి రోజు ఆర్డీవో రామభూపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ప్రవచనాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గరికపాటి నరసింహారావును కళాజ్యోతి కార్యవర్గం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# సర్ అక్రమాలపై వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

### ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం

### కాంగ్రెస్ పోరాటం.. ఎన్నికల సంఘం తీరుపై నిరసన




సెప్టెంబర్ 28, అరుణ ప్రభ : సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయంటూ నిరసనగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్దనున్న వైయస్సార్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత అని అన్నారు. సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల రక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని వజ్రేష్ యాదవ్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ రుద్దీన్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరసింహులు యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బాలు రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణ, డీసీసీ జనరల్ సెక్రటరీ బీపీటీ రాజు,ఏనుగు జలెందర్ రెడ్డి, అంజిరెడ్డి,ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవితో పాటు డివిజన్ ఉపాధ్యక్షులు యాసారం మహేష్, పాశం రాజు, కాటపాక కుమార్, మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు బోడిగే కృష్ణ గౌడ్, సుభాష్ నాయక్, సుదర్శన్ రెడ్డి, సుక్క జయందర్, సెక్రటరీ బొల్లురి నాగరాజు, అధికార ప్రతినిధి వెంకటేష్ గౌడ్, కార్యనిర్వాహక సభ్యుడు మహేశ్వరప్ప, కర్రె బలరాం,నాగరాజు,భరత్, విక్కీ, సంపత్, మహిళా అధ్యక్షురాలు ఎన్ ఎన్ కె దుర్గా మరియు తదితరులు పాల్గొన్నారు.



## నేత్రదానం చేసిన ఎస్‌బీఐ మాజీ మేనేజర్

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని కొత్తపేటకు చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజర్ రామాయణం ప్రభాకర్ సోమవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో రెండు నేత్రాలను దానం చేశారు. విషయం తెలుసుకున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారం మేరకు ప్రముఖ కంటి వైద్యులు నరసింహులు, ఆప్తల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప సమన్వయంతో అనంతపురం ఇండియన్ రెడ్‌క్రాస్ ఐ టెక్నీషియన్ జి.రాఘవేంద్ర నేత్రాలను సేకరించారు. రామాయణం ప్రభాకర్ రెండు నేత్రాల కార్నియాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపారని మానవతా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు శంకరనాయుడు, ఉపాధ్యక్షులు మంజునాథ్, క్రియాశీల సభ్యుడు రవికుమార్, ఆప్తల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.



## అర్బన్ హెల్త్ సెంటర్‌లో సేవలపై హరీష్‌బాబు ఆరా

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు సోమవారం పరిశీలించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆసుపత్రిని సందర్శించిన ఆయన.. వైద్యం కోసం వచ్చిన ప్రజలను నేరుగా కలిసి సేవల తీరుపై ఆరా తీశారు. వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య పరీక్షలు, ఇతర సౌకర్యాలపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ, డిస్పెన్సరీ, ల్యాబొరేటరీ, డ్రెస్సింగ్, అత్యవసర చికిత్స గది, ఓపీ రిజిస్ట్రేషన్ విభాగం, మైనర్ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆయా విభాగాల్లో అందుతున్న సేవలు, సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన సౌకర్యాలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హరీష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## రిటైర్డ్ డీఎస్పీ రమాకాంత్‌కు స్వర్ణ నంది

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన రిటైర్డ్ డీఎస్పీ రమాకాంత్‌కు 2026 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక స్వర్ణ నంది పురస్కారం లభించింది. పోలీసు సేవల్లో ఆయన అందించిన సేవలు, కర్తవ్యనిష్ఠ, వీరత్వం, మానవతా దృక్పథాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రమాకాంత్ ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ స్వర్ణ నంది పురస్కారం లభించడం పట్ల పలువురు పోలీసు అధికారులు, సహచరులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



## ఘనంగా శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవం

### భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు

### ముఖ్యఅతిథిగా సిగురు రవికుమార్ ముదిరాజ్

సెప్టెంబర్ 28, అరుణ ప్రభ : శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిగురు రవికుమార్ ముదిరాజ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి గీతాలు, నినాదాలతో ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా అంటూ భక్తిభావంతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథి సిగురు రవికుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ, వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తితో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, యువత, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని ఎల్‌సీకే పురం సెక్టార్ పరిధి సిద్ధయ్యగుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ ఉత్సవం, సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీడీపీఓ కే.వై.లక్ష్మి ఆధ్వర్యంలో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యు. అరుణమ్మ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, సర్వముఖ అభివృద్ధికి అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సూపర్‌వైజర్ అరుణమ్మ మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రగతిని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సేవల్లో సుదీర్ఘకాలంగా విశేష సేవలందిస్తున్న సీనియర్ టీచర్లు బి.బి.ఫాతిమా, రహమత్‌బీలను సీడీపీఓ లక్ష్మి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్‌సీకే పురం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## కేతిరెడ్డి ఎల్-4 కాలనీకి నీరందించాలి

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : కేతిరెడ్డి ఎల్-4 కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు, కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎస్.హెచ్.భాషా, జె.వి.రమణ, వి.వెంకటస్వామి మాట్లాడుతూ.. కాలనీలో సుమారు 28 రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెల రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. కాలనీలోని పైపులైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేస్తేనే నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని, వెంటనే వాల్వ్ ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ డీఈ సాయికృష్ణ మాట్లాడుతూ గురువారం నాటికి కాలనీకి పూర్తిస్థాయిలో నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటరాముడు, శీను, రామకృష్ణ, భారతి, వరాలమ్మ, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అమృత్ పనులకు మళ్లీ కదలిక

ధర్మవరం, సెప్టెంబరు 28; (అరుణ ప్రభ న్యూస్) : అమృత్-1 పథకం కింద ధర్మవరం పట్టణంలో చేపట్టిన తాగునీటి మౌలిక వసతుల పనులకు మళ్లీ కదలిక వచ్చింది. సుమారు రూ.17.57 కోట్లతో చేపట్టిన ఎల్ఎస్ఆర్ ట్యాంకులు, పంప్‌హౌస్, మోటార్లు, పైప్‌లైన్ పనులను మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో వేగవంతం చేస్తున్నారు. ఎర్రగుంట పంప్‌హౌస్, సిద్ధయ్యగుట్ట, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో చేపట్టిన పనులను మంత్రి ఆదేశాల మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు సోమవారం మున్సిపల్ డీఈ వీరేష్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు అనుసంధాన పైప్‌లైన్ పనులను సమన్వయంతో చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో తాగునీటి సరఫరాను బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని హరీష్‌బాబు తెలిపారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా తిరిగి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని సంగారెడ్డిలో కాంగ్రెస్ నిరసన

## భారీ ర్యాలీ, సభ నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం.. ఓటర్ల హక్కుల పరిరక్షణకు బూత్‌స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని నేతల పిలుపు



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు ఓట్ల తొలగింపు, ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ సమీపంలో ఉన్న జగ్గారెడ్డి నివాసం నుంచి పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన సభలో మెదక్ ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ, ఓటు చోరీ అంశంపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందన్నారు. బిహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భారీగా ఓట్లు తొలగించి భాజపా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు నోటీసులు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా మైనారిటీలు, ఎస్సీలు, పేదలు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలని కోరారు. ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న వారికి సైతం నోటీసులు రావడానికి కారణమేంటని ప్రశ్నించారు. అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హులైన వారి పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, ఓటు హక్కు పరిరక్షణకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఖమ్మం ఎంబీ గార్డెన్స్‌లో ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి, జనసేన పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిరియాల రామకృష్ణ, బండి నరేష్, మల్లెల సాయి తేజ, తనూజ రెడ్డి, దాసరి రవీష్ గార్లతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని 9 నియోజకవర్గాల ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ఓటరు నమోదు వేగవంతం, క్షేత్రస్థాయి ప్రచార వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు

# సమాజహితం కోసమే "రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక" ఏర్పాటు

## వేదిక కన్వీనర్ కె. రామచంద్రమూర్తి



ప్రతి రంగంలోనూ విలువలు క్షీణిస్తున్న నేటి ఆందోళనకర పరిస్థితుల్లో, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మౌలిక విలువలను పరిరక్షించేందుకే "రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక" (ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఏర్పాటైందని, ప్రముఖ పాత్రికేయులు, వేదిక కన్వీనర్ కె.రామచంద్రమూర్తి స్పష్టం చేసారు. సోమవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జి. హరగోపాల్, శాసన మండలి సభ్యులు యం. కోదండరాం, సామాజిక ఆలోచనపరులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి యం.వి.రెడ్డి, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తిలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో మొత్తంగా, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో, రాజకీయ సంభాషణ రోజురోజుకూ దిగజారుతోందని, ఒకప్పుడు ఆత్మగౌరవం, పరస్పర గౌరవంతో కూడిన భాష స్థానంలో దూషణలు, అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు చోటుచేసుకుంటున్నాయని, ఈ క్రమంలోనే సమాజంలో ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు బలహీనపడుతున్నాయని రామచంద్రమూర్తి ఆవేదన వ్యక్తం చేసారు. భయమో, పక్షపాతమో లేకుండా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాల్సిన సమయం ఆసన్నమైనందు వల్లే ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విస్తృతమైన అంశమైనప్పటికీ, ఈ వేదిక ప్రధానంగా రాజ్యాంగ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం హామీ ఇచ్చిన విలువలు, హక్కులు, సంస్థల పరిరక్షణపై దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. కోట్లాది ప్రజల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి ప్రజాస్వామ్య వేదికలను ప్రతి పౌరుడు స్వాగతించాలని ఆయన కోరారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ, రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలకు చురుకైన రక్షణ అవసరమని అన్నారు. ఈ కృషిలో పౌర సమాజం, విద్యావేత్తలు, మీడియా కీలక పాత్ర పోషించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సంస్థల స్వేచ్ఛలపై ఒత్తిడి ఏర్పడినప్పుడు సమాజం స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలు, ప్రజా సమస్యలపై వేదిక చర్చిస్తుందని, వాస్తవాలు, సమాచార ఆధారంగా జోక్యం చేసుకుంటుందని తెలిపారు. సంబంధిత వర్గాలకు సూచనలు, సిఫారసులు అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల ఆందోళనలు, నిబద్ధతలను పంచుకునే పౌరులందరూ ఈ ప్రయత్నంలో తమతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేసారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓటు హక్కు పరిరక్షణ, డీలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరాన్ని ఆమె ప్రస్తావించారు. సామాజిక విశ్లేషకులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనకు ప్రజల దృష్టి మరింత అవసరమైన సమయంలో ఈ వేదిక ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పౌరుల్లో మరింత అవగాహన కల్పించేందుకు వేదిక పనిచేస్తుందని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి ఎం.వి.రెడ్డి ఈ వేదికను స్వాగతిస్తూ, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు తమ అనుభవం, నైపుణ్యాలను రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛల పరిరక్షణకు వినియోగించవచ్చని అన్నారు. ఈ కృషికి మీడియా సహకారం అవసరమని, భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో అంతర్భాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ వేదిక ఆధ్వర్యంలో సెమినార్లు, ప్రజా చర్చలు నిర్వహించడం, పరిశోధనలు చేపట్టడం, నివేదికలు మరియు సిఫారసులు ప్రచురించడం, పౌరులు మరియు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరపడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. ఇంకా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తి తదితరులు మాట్లాడారు.



# నేడు జరిగే పల్లె పండగ 3.0ను జయప్రదం చేయండి

## ::: కందుకూరు నియోజవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): నేడు ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని వరికుంట పాడు మండలంలోని రామ పురం గ్రామంలో జరిగే పల్లె పండుగ 3.0 ను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. కందుకూరులో జరిగిన సన్నాహక సభలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలోని ప్రతి నాయకులు , కార్యకర్తలు, పార్టీ అభిమానులు తప్పకుండా హాజరు కావాలని, అదేవిధంగా పల్లె పండుగను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నియోజవర్గం నుంచి సుమారు పదివేల మందిని తీసుకెళ్లే విధంగా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు , యూనిట్ ఇంచార్జి లు , కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.





# భగత్ సింగ్ స్ఫూర్తి యువతకు ఆదర్శం

## సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): భగత్ సింగ్ స్ఫూర్తి యువత కు ఆదర్శం అని, ఆయన ఆశయాలు కొనసాగించాలని సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో 119 వ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ ఉరికంబాన్ని కూడా లెక్క చేయకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు అని కొనియాడారు. భారతమాతకు దాస్య విముక్తి కలిగించే పోరాటంలో తెల్ల వాడి గుండెలను చీల్చి చెండాడిన వీరుడని కొనియాడారు. యువత నేడు మత్తు పదార్థాలకు బానిస కాకుండా సమాజం లోని సమస్యల పట్ల పోరాడాలన్నారు. దానికి నిదర్శనం దేశంలో నీట్ పేపర్ లీకేజీ పై జరిగిన ఉద్యమమే నిదర్శనం అన్నారు. యువత భగత్ సింగ్ ను స్ఫూర్తి గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోబిల్డింగ్ వర్కర్ జిల్లా అధ్యక్షులు మీరా, మున్సిపల్ నాయకులు గోపి,విద్యార్థి నాయకులు ఇర్ఫాన్, మనోజ్, సంపూర్ణమ్మ, సాహిబ్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా ఎర్రబోతులి దినేష్ నియమాపకం



అరుణ ప్రభ . సెప్టెంబర్ 28 : తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం బురద గల్లి కొత్తపాలెం కు చెందిన యువకుడు నిరంతరం మానవ హక్కుల పరిరక్షణకై తపించే ఎర్రబోతు దినేష్ ను జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షులు టి. ఎస్. రామచంద్ర నాయుడు నియమించడం జరిగింది ఈ పదవి రావడం పట్ల తిరుపతి నెల్లూరు జిల్లాలకు చెందిన యువకులు దినేష్ కు అభినందన తెలియజేశారు

# విశాఖలో వైద్య విద్యార్థిని శ్రావణి ఆత్మహత్య

విశాఖపట్నం నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చిన ఓ వైద్య విద్యార్థిని తన జీవితాన్ని అర్థాంతరంగా ముగించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి (22) అనే యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన శ్రావణి విశాఖ ఏఎంసీలో పీజీలో చేరింది. నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చినవాల్తేరులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. సోమవారం ఉదయం ఆమె తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ శకుంతల ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేశారు.



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక సమావేశం

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ సర్కిల్ ( అరుణ ప్రభ న్యూస్ 28) ఈరోజుహైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్య నేతల ప్రత్యేక సమావేశంలో గౌరవ మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు,ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై నాయకులతో చర్చించారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.